J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 2 16.6.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# లవకుమార్..మృతి బాధాకరం

## - నివాళులర్పించిన రవాణాశాఖ కమిషనర్ చందర్





నెల్లూరు రవాణాశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న లవకుమార్ ఈనెల11న కన్నుమూశారు. గత రెండు నెలలుగా ఆయనకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో శెలవు పెట్టి చికిత్స చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పరిస్థితి విషమించి మరణించడంతో రవాణాశాఖ అధికారులు, సిబ్బంది బాధను వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ఆర్టీఓ కె.మురళీమోహన్‌రావు ఆధ్వర్యంలో కార్యాలయంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత విలువలతో కూడిన ఒక మంచి ఉద్యోగి హఠాన్మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉపరవాణా కమిషనర్ చందర్ లవ్‌కుమార్ ఆత్మశాంతికై మౌనం పాటించి నివాళు లర్పించారు. లవకుమార్ మృతి బాధాకరమని, ఆయనను కోల్పోవడం తీరని లోటని అంటూ, లవకుమార్ కుటుంబసభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# కలువాయమ్మ తల్లికి.. జలాభిషేకం



మండల కేంద్రంలోని కలువాయిలో గ్రామశక్తి శ్రీ కలువాయమ్మ అమ్మవారికి ఇటీవల జలాభిషేకం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి 108 కలశాలతో జలాలను తెచ్చి అభిషేకించారు. 'అమ్మా కరుణించమ్మా..కలువాయమ్మా' అంటూ భక్తులు అమ్మవారికి దండాలు పెట్టు కుంటూ ప్రదక్షిణలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఉభయకర్తలు టి.సుబ్రహ్మణ్యం, చంద్రావతి దంపతులు, వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కన్నులపండువగా ఈ వేడుక జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, మహాలక్ష్మి అష్టోత్తర సహస్రనామ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# 'శ్రీ వెంగమాంబ మహాత్మ్యం'..4వ ముద్రణ ఆవిష్కరణ



నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, పాత్రికేయులు డాక్టర్ కనియంపాటి రామకృష్ణ ఎంతో భక్తిశ్రద్ధలతో రచించిన భక్తుల పాలిట కల్పవల్లి 'శ్రీ వెంగమాంబ మహాత్మ్యం' (చరిత్ర-తిరునాల) గ్రంథం (4వ ముద్రణ) ఈనెల 13వ తేదిన నర్రవాడలోని శ్రీ వెంగమాంబదేవి ఆలయంలో ఆవిష్కరణ జరిగింది. నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవాలయం కార్యనిర్వహణాధికారిణి వెట్టిగుంట ఉషశ్రీ చేతులమీదుగా ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. దుత్తలూరు మండలం నర్రవాడ క్షేత్రంలో వైభవంగా జరుగుతున్న వెంగమాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడవ రోజు మంగళవారం ఈ గ్రంథావిష్కరణ జరగడం పట్ల భక్తులు, ఆలయ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇఓ ఉషశ్రీ మాట్లాడుతూ, అమ్మవారి చరిత్రను ఆవిష్కరించడంలో గ్రంథ రచయిత డా. కనియంపాటి రామకృష్ణ తీసుకున్న కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. అనంతరం రచయితను ఆమె ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి సీహెచ్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొని రచయితను అభినందించారు.

# కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో 'రిటైల్ లోన్ ఎక్స్‌పో'

నెల్లూరు నగరంలోని కెనరా బ్యాంకు రీజనల్ కార్యాలయం వద్ద వినియోగదారుల సౌకర్యార్థం రెండురోజుల పాటు మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పోను ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఏ.నాగరాజు ఈనెల 10న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా రిటైల్ లోన్ ఎక్స్‌పోలో సుమారు 4కోట్ల రూపాయల మేర విద్య, గృహ నిర్మాణ, కార్లు మరియు మార్టిగేజ్ రుణాలను వెంటనే మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మారుతీ, హోండా, ఏం.జి.వి.డబ్ల్యు తదితర కార్ల కంపెనీ డీలర్లందరినీ ఒక చోటకు తీసుకురావడం జరిగిందని, కార్ల కొనుగోలు, విద్య, గృహ నిర్మాణాలకు రుణాలు అవసరమైనవారు కెనరా బ్యాంకు శాఖలను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. డివిజనల్ మేనేజర్ రామ్‌కుమార్, రిటైల్ అసెట్ హబ్ సిబ్బంది, జిల్లాలోని కెనరా బ్యాంకు శాఖల మేనేజర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

## డెప్యూటి డిఇఓగా

# ప్రసన్నలక్ష్మి



జిల్లా ఉప విద్యాశాఖాధికారిణిగా ఎం.ప్రసన్నలక్ష్మి నియమితుల య్యారు. విజయవాడలోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో మోడల్ స్కూల్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను బదిలీపై ఆ శాఖ ఉన్నతాధికారులు నెల్లూరులో నియమించారు. నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆమెకు ఆమె బాధ్యతలు చేపట్టారు.

## పాడిరైతులకు

# 'పశు బీమా'



పశు బీమా పథకం పాడిరైతులకు ఎంతో ఉపయోకరమని, దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు చెప్పారు. ఇటీవల ఆయన మండల కేంద్రమైన మనుబోలులో పశు వైద్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ,ఈ పథకానికి సంబంధించిన వివరాలను రైతుభరోసా కేంద్రాల్లో తెలుసుకోవచ్చన్నారు. బీమా పథకంతో పాటు ఇంకా అనేక పథకాలు పాడిరైతుల కోసం ప్రభుత్వం రూపొందించిందని, వాటిని కూడా అవగాహన చేసుకుని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామతీర్థంలో

# బ్రహ్మోత్సవాల వైభవం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన విడవలూరు మండలం రామతీర్థంలోని కామాక్షిదేవి అమ్మవారి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున భక్తులు తరలివస్తున్నారు. రామతీర్థం సమీపంలోని సాగరతీరంలో స్నానాలు చేసుకుని, శ్రీ స్వామివారి ఆలయాన్ని సందర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయాన్ని విద్యుత్‌కాంతులతో శోభాయమానం చేశారు. రామతీర్థం-వరిణి గ్రామాల పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు సేవలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఉభయకర్తల సహకారంతో వేడుకలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ఛైర్మెన్ చంద్రయ్య, ఇఓ రామకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన రథోత్సవం ఈనెల 16న, 17న కల్యాణోత్సవం నేత్రపర్వంగా ఉంటుందని. 18న అమావాస్య నాడు తీర్థవాది రావడం విశేషమని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# మహత్తరమైనది నేత్రదానం



నెల్లూరు నగరంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురు ఇటీవల మృతి చెందగా, వారి నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. బాలాజీనగర్‌కు చెందిన జొన్నవాడ లక్ష్మీనరసింహులు (78), రంగనాయకులపేటకు చెందిన అచ్యుత ఆదిశేషయ్య (75), నవాబుపేటకు చెందిన రాయపల్లి శ్యామలమ్మ వయోభారంతో (90) మరణించారు. దర్గామిట్టలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న ముప్పాల విజయవర్మ(40) గుండెపోటుతో చనిపోయారు. వారి కుటుంబసభ్యుల అంగీకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థకు చెందిన నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ లాలేష్‌లు మృతుల నేత్రాలను సేకరించి, మృతుల కుటుంబసభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీసింగ్ మాట్లాడుతూ నేత్రదానం ఎంతో మహత్తరమైనదని, అదొక పుణ్యకార్యమని అన్నారు. ఒకరి నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపును ప్రసాదించవచ్చని, మానవీయమైన ఈ సేవలో పాల్గొన్నవారందరికీ ఆయన కృతజ్ఞతలు చెప్పారు. నేత్రదానం చేయదలచుకున్నవారు 99481 64781, లేదా 93471 11033 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేత్రదాన మోటివేటర్ వైవి సుబ్బారావు, చిరంజీవి బ్లడ్-ఐ బ్యాంకు ఇన్‌చార్జి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు విద్యారాయితీలు ఇవ్వండి


## - కలెక్టర్‌కు ఏపీయుడబ్ల్యుజె నాయకుల వినతి



పాత్రికేయుల పిల్లలకు జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీని కల్పించాలని ఏపీయుడబ్ల్యుజె నాయకులు ఈనెల 12న కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు మంజూరుచేయాలని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ మంజూరు చేయాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని కలిశారు. జర్నలిస్టులపై దాడులు జరిగిన సందర్భంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజె జిల్లాశాఖ అధ్యక్షులు వల్లూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ మస్తాన్‌రెడ్డి, కోశాధికారి గడ్డం హనోక్, ఉపాధ్యక్షులు దయాశంకర్, వెంకటసుబ్బయ్య, కార్యవర్గసభ్యులు నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చందు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్



నెల్లూరు నగరపరిధిలోని ఖాళీప్లాట్ల యజమానులు వారి స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అవసరమైతే వారికి సహకరించేందుకు నగరపాలక సంస్థ సిద్ధంగా ఉందని, ఖర్చులు భరించుకుంటే, నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి ఆ స్థలాలను యంత్రాలతో పరిశుభ్రం చేస్తారని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ చెప్పారు. ఇటీవల ఆయన నగరంలోని పలు ఖాళీస్థలాలను పరిశీలించి, అవి మురుగు గుంటలుగా అపరిశుభ్రంగా ఉండడంతో వాటిని బాగుచేసుకోవాలని ప్లాట్ల యజమానులకు చెప్పాలని సిబ్బందికి చెప్పారు. అపరిశుభ్రంగా ఉండే ప్లాట్లను గుర్తించి యజమానులకు నోటీసులివ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అపార్ట్‌మెంట్‌లలో ఉండేవారు ఆ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానాలు తప్పవని చెప్పారు. కార్పొరేషన్ ఎంహెచ్ఓ డాక్టర్ పి.వెంకటరమణ, శానిటరీ సూపర్‌వైజర్లు ఆయన వెంట పాల్గొన్నారు.

# కొండాపురంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

మండలకేంద్రమైన కొండాపురంలో మే 8 నుంచి జూన్ 11వ తేది వరకు వేసవి విజ్ఞానశిబిరం నిర్వహించారు. ఈ నెల 12న ముగింపు సందర్భంగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు పెట్టి లైబ్రేరియన్ జె.కొండయ్య, గుర్రం మాల్యాద్రి ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులందరికీ జిల్లా గ్రంథాలయసంస్థ తరపున సమ్మర్‌క్యాంప్ సర్టిఫికెట్లు ఇచ్చారు.

J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 16




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 02 16.06.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఉద్యోగుల కష్టం.. ఎవరికి నష్టం?

## వారి మాట పెదవి దాటితే - అధికారపార్టీ పదవికి గండమే

## రామారావు, చంద్రబాబు ప్రభుత్వాలు ఆ అనుభవాలను రుచి చూశాయి


## అదే బాటలో ఉన్న వైసీపీ.. నాయకులను చేరదీసి.. ఉద్యోగులకు మొండి చేయి

## ఈ 4 ఏళ్లలో ఉద్యోగులకు నిత్యం ప్రభుత్వంతో పోరాటమే

*ఉద్యోగుల కష్టం ఖచ్చితంగా ప్రభుత్వానికే నష్టమన్న విషయం గతానుభవాలు ఎన్నో ఉదాహరణగా మనముందు ఉన్నాయి. అది చెరిగిపోని చరిత్ర. వారు ఓటింగ్ ప్రక్రియను ప్రభావితం చేస్తారా? చేయరా? అన్న విషయం పక్కనపెడితే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉద్యోగుల మాట వారి పెదవి దాటితే, ఎంతటివారికైనా పదవీ గండం తప్పదనడానికి ఎన్నో సంఘటనలు అక్షర సాక్ష్యాలు. గతంలో ఎన్టీఆర్, ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వాలు కుప్పకూలడానికి ఉద్యోగుల మౌత్‌పబ్లిసిటీ కూడా ప్రధాన కారణమే అన్నది ఎవరూ కాదనలేని కఠోర సత్యం.*

రాష్ట్రంలో 10 లక్షలకు పైగా ఉద్యోగులున్నారు. వీరి కుటుంబాల్లో ఉండే ఓట్ల సంఖ్యే 40 లక్షల వరకు ఉంటుంది. కాబట్టి ఏ ప్రభుత్వమైనా, రాజకీయపార్టీ అయినా సాధ్యమైనంత వరకు ఉద్యోగులను వాడుకుని అధికారంలోకి రావడానికి మార్గం సుగమం చేసుకుంటాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ పార్టీ అదే చేసింది. ఉద్యోగులు అడిగినా అడగకపోయినా, కోరినా కోరక పోయినా వారి ప్రతి సమస్యపై తానే ముందుగా స్పందించి ధారాళంగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. ఇలాంటివి జరగని పక్షంలో ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజల్లో సహజంగా ఉండే ఈర్ష్యా భావాన్ని రాజకీయ పార్టీలు తమ ప్రయోజనాలకు వాడుకుని వారిని ప్రజల్లో మరింత పలుచన చేసి ఓట్లు పెంచుకునే వ్యూహాలు కూడా పన్నుతుంటాయి. 2019 ఎన్నికల్లో కేసీఆర్ ఇలాగే చేసి లబ్ధిపొందారు. కానీ, ఏపీలో వైసీపీకి 151 సీట్లు వచ్చేసరికి ప్రభుత్వం వద్ద ఉద్యోగుల ప్రాధాన్యం తగ్గిపోయిందన్నది ఉద్యోగ సంఘాల సభ్యుల ఆవేదన. కేవలం ఉద్యమాలను నడిపించే నాయకులను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటే చాలు ఉద్యోగులంతా దారిలోకి వచ్చేస్తారన్న ధోరణి కనిపిస్తోందన్నది వారి అభిప్రాయం. కానీ, ప్రస్తుతం ఉద్యోగ సంఘాల నాయకులను ఉద్యోగులు నమ్మడం లేదు. వారిని తమ నాయకులుగా చెప్పుకోవడానికి కూడా ఇష్టపడడం లేదు. సీపీఎస్ రద్దు హామీ నుంచి ఒకటో తేదీన జీతాల చెల్లింపు వరకు ఏ ఒక్క సమస్య పరిష్కారం కావడంలేదు. అయినా ఉద్యోగ సంఘాల నేతలు సీఎం జగన్‌ని పోటీలుపడి కీర్తించడం ఉద్యోగులను మరింత బాధిస్తోంది. అందుకే ఉద్యోగ సంఘాల నాయకులకు వ్యతిరేకంగా ఉద్యోగులు బహిరంగ లేఖలు రాస్తున్నారు.

14 లో



లాయర్
జూన్ 16, 2023

# 'మధుమేహం' పెనుముప్పుగా మారనుందా?

దేశంలో మధుమేహ వ్యాధిగ్రస్తులు నానాటికీ పెరుగుతున్నారా?.. అది చివరికి దేశప్రజలను పట్టిపీడించే పెనుముప్పుగా మారనుందా?..అనే ప్రశ్నలకు వైద్యనిపుణుల నుంచి 'అవును' అనే సమాధానాలే వస్తున్నాయి. అనేక అధ్యయనాలు కూడా ఆ సంగతిని నిర్ధారిస్తున్నాయి. మధుమేహం (చక్కెర వ్యాధి లేక డయాబెటిస్) వ్యాధి అంతకంతకూ పెరుగుతుండడం వల్ల ప్రజల ఆరోగ్యం క్రమేణా దెబ్బతింటోందని కూడా నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మనదేశ జనాభాలో 11.4 శాతం మంది ప్రజలు మధుమేహంతో బాధలు పడుతున్నారని సాక్షాత్తూ భారత ఆరోగ్యకుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నిధులతో నిర్వహించిన ఒక ప్రత్యేక అధ్యయనంలో తాజాగా వెల్లడి కావడం గమనార్హం. ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచంలో ఈ వ్యాధి భారత్‌లోనే అత్యధికం. రెండు-మూడు స్థానాల్లో చైనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలున్నాయి. అంత తీవ్రంగా పెరుగుతున్న ఈ వ్యాధి వ్యాప్తిని బట్టి, భారత్ ప్రపంచ మధుమేహ కేంద్రంగా కూడా మారిపోతోందనే ఆందోళన కూడా సర్వత్రా వినిపిస్తోంది. మద్రాస్ డయాబెటిస్ రీసెర్చి ఫౌండేషన్ (ఎండిఆర్ఎఫ్), ఐసిఆర్ఎం పరిశోధకులు సంయుక్తంగా దాదాపు పదేళ్ళ పాటు మధుమేహ వ్యాధి వ్యాప్తిపై పరిశోధన నిర్వహించి భారత్‌లో మధుమేహం ఏ స్థాయిలో ఉందో ఆ వివరాలను వెల్లడించారు. ఆ నివేదిక ప్రకారం మధుమేహంతో 11.4 శాతం మంది, మధుమేహానికి ముందు వచ్చే ప్రీ-డయాబెటిస్‌తో మరో 15.3 శాతం మంది ప్రజలు అనునిత్యం సతమతమవుతున్నారు. 2017లో మన దేశంలో మధుమేహం 7.5 శాతం ఉంటే, 2021కల్లా అది 50 శాతం పెరిగిందని, దాదాపు 10 కోట్లమందికి పైగానే ప్రజలు మధుమేహంతో, 13.6 కోట్ల మంది ప్రజలు ప్రీ డయాబెటిస్‌తో నానాబాధలు పడుతున్నారని ఆ నివేదిక వెల్లడించింది. ఇప్పుడు ప్రీ-డయాబెటిస్ ఉన్నవారిలో 60 శాతం మంది రానున్న అయిదేళ్ళలో మధుమేహవ్యాధిగ్రస్తులుగా మారే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 11 మంది పెద్దవారిలో ఒకరికి మధుమేహం ఉంటోంది. మన దేశంలో గోవా, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో మధుమేహవ్యాధిగ్రస్తుల సంఖ్య అధికంగా ఉందని, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో కూడా వేగంగా పెరుగుతోందని ఆ అధ్యయనం హెచ్చరిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోకంటే పట్టణప్రాంతాల్లో మధుమేహ ఎక్కువగా ఉండడం గమనించాల్సిన విషయం. నానాటికీ ప్రజల జీవనశైలి మారిపోతుండడం, నిర్ణీతవేళల్లో నిద్రాహారాలు లేకపోవడం, మానసికంగా అనేకరకాలైన వత్తిడులకు గురవుతుండడం, అస్తవ్యస్తమైన పనివిధానం, అసహజ ధోరణులకు అలవాటుపడడం, శారీరక శ్రమ తగ్గిపోతుండడం వంటివన్నీ మధుమేహ వ్యాధికి కారణాలవుతున్నాయి. అయితే, ఎన్నిరకాల సమస్యలున్నా మధుమేహాన్ని అదుపులో పెట్టుకోవచ్చు. దానిని నియంత్రించడం మనచేతుల్లోనే ఉంది. ఆ వ్యాధి పట్ల అవగాహనే దీనికి సరైన మందు. జీవనశైలిని మార్చుకుని, సంప్రదాయబద్ధమైన మంచి ఆహారపుటలవాట్లతో దానిని అదుపులో పెట్టుకోవచ్చు. అధిక దాహం, విపరీతమైన అలసట, బరువు తగ్గడం, కంటిచూపు మందగించడం, గాయాలు మానకపోవడం వంటివి డయాబెటిస్ లక్షణాలుగా చెప్తున్నారు. ఇది శరీరంలోని బీటాకణాలు వంటి ఇన్సులిన్ వ్యవస్థను దెబ్బతీస్తుంది. కిడ్నీజబ్బులు, గుండెజబ్బులు వంటివి వచ్చేందుకు కూడా దీనివల్ల అవకాశం ఉంటుంది. వంశపారంపర్యంగా కూడా ఈ వ్యాధి సంక్రమిస్తుంటుంది. దీనిని నియంత్రించేందుకు ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను పాటించాలి. వ్యాధిగ్రస్తులు ఆహారంగా ఏమి తీసుకోవాలో వైద్యుల సలహాలు తప్పకుండా పాటించాలి. ప్రతిరోజు వ్యాయామం, నడక వంటివి చేయడం తప్పనిసరి. మధుమేహ వ్యాధిని నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అందుకు ప్రభుత్వాలు కూడా చేయూతనివ్వాలి. వ్యాధిగ్రస్తులు వాడే మందుల్లో అధిక శాతం రాయితీ ఇవ్వాలి. ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేందుకు పెద్దఎత్తున ప్రచారం చేయాలి. డయాబెటిక్ వ్యాధి చికిత్సలు, వైద్యసేవలు అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉండేలా ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేయాలి. డయాబెటిస్ నియంత్రణకు ప్రత్యేక వైద్యసిబ్బందిని, ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేయాలి.

ఏదేమైనా మధుమేహం వ్యాధి బాధల నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలి. తద్వారా 'ఆరోగ్య భారత్'ను సాకారం చేసుకోవాలి.

# తెలుగుదేశమోళ్ళలో ఉసారు!



ఏంది సుబ్బమామా యాడికి ఎగెత్తతా ఉండావా...? ఒరే అబ్బయ్యా యువగలం యాతర మన నెల్లూరుజిల్లాలోకి వచ్చిందంటరా, నేంగూడా పోతుండా...! లోకేశు నడక యాతర మొదలైన కాడనుండి చూస్తుండా అబ్బయా, రాను రాను జనాలు పెరగతా ఉండారు. ఈల్లంతా ఊరికే వస్తావుండారా... లేక నిజంగానే ఆ పిల్లోడి మీద మోజుతోనా తెలుసుకుందామని ఎల్తా ఉండా. వైసీపీ పార్టీని పెట్టినకాడి నుండి జగనుకి నెల్లూరుజిల్లా పెజలు బెమ్మరథం పట్టారు. ఇప్పుడు అదే జిల్లాలో ముగ్గురు ఏం.ఎల్.ఏలు తిరగబడ్డారు. ఎంకటగిరిలో రామనారాయణరెడ్డి, ఉదయగిరిలో శేకరయ్య, నెల్లూరురూరల్‌లో సీదరు. ఈల్లంతా ఇప్పుడు ఒకటైపోయారు. ఈళ్ళు ఇంకా శానామందికి గాలం యాస్తుండారంట తెలుసా...?

మొన్న మంగళారం లోకేశుని సూడ్డానికి జనాలు ఎగబడ్డారంట. తల మాడిపోయే ఎండలు కాస్తున్నా జనం లెక్కసేయడం లేదురా అబ్బయ్యా...! ఇదేం ఇసిత్రంరా.... ఎలచ్చన్లు వస్తున్నాయంటే ఏ పార్టీవోడు వచ్చినా జనం ఎగేసుకుని ఎల్తావుండారు. ఒక ఇసయం మాత్రం చెప్పాలబ్బాయ్యా... లోకేశు యువగలం యాత్రకి సెంద్రబాబు




చేస్తున్న ప్రచారయాత్రలకి జనాలు మాత్రం మందలు మందలుగా వస్తావుండారు. జగను అధికారంలోకి వచ్చిన 2019 నాటికి సెంద్రబాబు పార్టీ సచ్చిపోయింది. ఇంక ఆ పార్టీ మూటాముల్లె సర్దుకుని బిసానా ఎత్తేయాల్సిందే అని అందరూ అనుకున్నారు. జగను కుర్రోడు బెమ్మాండంగా పరిపాలిస్తాడు, ఇంకా ముప్పై సంవత్సరాలు ఆ అబ్బయ్యే ముక్కెమంత్రి అని శాలా మంది ఆశలు పెట్టుకున్నారు. ఆ ఆశలన్నీ సంకనాకిపోయినై. ఇప్పుడు సెంద్రబాబు పార్టీ మళ్లీ బతికి బట్టకడతా వుందంటే కారణం వైసీపీ వోళ్లే. వోళ్లు చేసే అరాశకాలు సూసి జనం ఇసిగిపోయి వుండారు. జగను మంచోడే... ఆయన మనుషులే మహామొదురు. మా నాయకుడు దబ్బులిస్తావుండాడు ఆయనకి ఓట్లేయకుండా యాడికి పోతారులే అన్నది వారి ధీమా. కేవలం జగను ఇచ్చే కాసులకి జనాలు కక్కుర్తి పడతారన్నది వారి నమ్మకం. ఎట్టయినా మళ్లీ గెలవాలని జగను తపనపడతా ఉంటే, ఆయన మడుసులు మాత్రం పార్టీని గబ్బు పట్టిస్తా వుండారు. ఈల్లు చేసే పనికిమాలిన పనులవల్ల జగను సెడ్డయి పోతావుండాడు. మొత్తానికి పరిస్థితి బాగాలేదబ్బయ్యా..! వైసీపీ వోల్లు మాత్రం తెలుగుదేశానికి అంత సీను లేదు అని కొట్టిపారేస్తా ఉండారు. 170కి పైగా సీట్లతో మళ్లీ మేమే గెలుస్తామంటున్నారు. మళ్లీ గెలిస్తే మంచిదే, అదే మళ్లీ 150పైన సీట్లు గాని వచ్చాయనుకో నాయాల్ది ఈసారి ఇరగదీస్తారు.

గెలిచేదెవరు ఓడేదెవరు అని నిర్ణయించడానికి ఇంకా సానసైము వుంది. అయితే లోకేశు యువగలం యాత్ర మాత్రం బాగా జరగతా వుందాది. నాలుగేళ్లుగా సప్పబడిపోయిన తెలుగుదేశమోళ్లలో ఉసారు వచ్చింది. తమతో పాటు అధికార పార్టీ ఏం.ఎల్.ఏలు కూడా ముగ్గురు తోడు రావడంతో ఇక సూసుకో నా సామిరంగా భలే ఉసారుగా వుండారు. సూడాల లోకేశు ఈ జిల్లా నుండి ఎల్లిపోయే లోపల ఎంతమంది నాయకులని పెబావితం చేస్తాడో...!

-సదువుకోని సుబ్బయ్య

# లంచం రాజకీయాలు

- యెన్నికల్లో లంచం దీస్కొనేవాళ్ళు–
ప్రజాస్వామ్య వృక్షాన్కి బట్టిన చీడపురుగులు.
లంచం యిచ్చేవోళ్ళు–
ఆ వృక్షాన్కి బట్టిన వేరుపురుగులు.
- తరగతి గదిలో భావిభారత పౌరుల్ని తీర్చిదిద్దాల్సిన
గురుతర బాధ్యతని నిర్వర్తించాల్సిన
ఉపాధ్యాయులన్బడే 'గరువులు'కి జరిగే యెన్నికల్లో–
అభ్యర్థులు తమ గెలుపుకి డబ్బీటం,
గురుదేవులు చెయ్యిసాచి దీస్కోటం,
కొందరు గరువర్యులు
'హస్తవాణి' (సెల్యులర్ ఫోన్) గావాలని
వాళ్లని దేబిరించడం ఘోరాతిగోరం.
యిచ్చే, దీస్కొనే ఈ దొంగ గురుదేవులా
సమాజాన్ని ఉద్ధరించేది?..
- లంచమీటం, లంచం దీస్కోటం నేరమైతే మాకేం?..
యిష్టమైన పెంట యింగువ సమమని
మహాకవి వేమనంతటోడే జెప్పొడ్గదా?..
అది పెంటైతే అయింది. అది మాకిష్టం...అంతే!
యిదీ–విలువల వలువలిప్పేస్కొని దిరగ్తుండే
తప్పుడ్రాజకీయ నాయకుల, పౌరుల మనసులో మాట.
దానికనుగుణమైన నీచత్వమే
గత కొంతకాలంగ
మన్దేశంలో జరగ్తుండే యెన్నికల బాగోతం!

తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, నెల్లూరు.

# మండుటెండల్లో బడులకెలా వెళ్ళాలి?




ఇప్పుడు ఎండలు మండిపోతుంటే పిల్లలను ఎలా బడికి పంపాలో అర్థం కావడం లేదు. సాధారణంగా ప్రతి వేసవిలోనూ సెలవులయ్యాక బడులు తెరవడం మామూలే. కానీ ఈ ఏడాది ఎండలు మరీ మండిపోతున్నాయి. ఒంటిపూట బడులకు వెళ్ళాలన్నా కష్టంగానే ఉంది. ఉదయం 7గంటల నుంచే ఎండ భగ్గుమంటోంది. ఇళ్ళ వద్దనుంచి బడులకు వెళ్ళాలన్నా, మధ్యాహ్నం తిరిగి ఇళ్ళకు రావాలన్నా ఎండల్లో బాగా ఇబ్బందిగా ఉంటోంది. తిరిగి వచ్చే సమయానికి మిట్టమధ్యాహ్నం అవుతుండడంతో మరింత భగభగలాడుతోంది ఎండ. ప్రభుత్వం బడులకు సెలవులు పొడిగిస్తే బావుంటుంది.

– ఎస్.భాగ్యలక్ష్మి, కోవూరు.

# సంక్షేమ హాస్టళ్లు..ఇక కనుమరుగైనట్లేనా?

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉన్న సంక్షేమ హాస్టళ్ళను, ముఖ్యంగా దళితులు, గిరిజనులు చదువుకునే హాస్టళ్ళను ప్రభుత్వం రద్దుచేయడంతో అట్టడుగువర్గాల ప్రజలకు విద్య దూరమైపోతోంది. అనాదిగా అజ్ఞానంతో, అమాయకత్వంతో ఉండే అనేకవర్గాల ప్రజలు, ఆదిమజాతులకు చెందిన గిరిజన చిన్నారుల పట్ల కూడా ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తోండడం దారుణం. మారుమూల గ్రామాల్లో సైతం ఎంతోకాలంగా ఉన్న హాస్టళ్ళను మూసివేయడంతో బడుగు బలహీనవర్గాల విద్యార్థుల చదువులు ఆదిలోనే అటకెక్కిపోతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా దయతలచి పేదల హాస్టళ్లను తిరిగి తెరిపించి విద్యను అందుబాటులోకి తెచ్చి, వారికి చదువుకునేందుకు అన్ని సదుపాయాలు కలిగించాలని విన్నపం.

– డి.ఆర్ శ్రీను, బోగోలు.

# చీకట్లో మగ్గుతున్న ఉదయగిరి బస్టాండ్

ప్రయాణీకుల రద్దీ, బస్సుల రాకపోకలతో ఉదయగిరి బస్టాండ్ కోలాహలంగానే ఉంటుంది. అయితే, సరైన విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో బస్టాండ్ చీకటిపడితే చాలు అంధకారంలోనే మగ్గిపోతుంటుంది. బస్టాండ్ సెంటర్‌లో స్థానిక ప్రజలతో పాటు బస్సుల నుంచి దిగివచ్చే ప్రయాణీకుల రద్దీ ఉన్నా, దుకాణాలు తెరిచే ఉన్నా ఏదో ఒకటిరెండు వీధిలైట్లు తప్ప విద్యుత్ వెలుగులు ఉండడం లేదు. రాత్రిపూట దుకాణాలు మూసివేస్తే బస్సుల్లో వచ్చే ప్రయాణీకులు చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి ఎంతోకాలం నుంచి ఉన్నా అటు పంచాయతీ అధికారులు కానీ, లేదా ఆర్టీసీ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ఒక్క ఉదయగిరి బస్టాండే కాదు, అనేక గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్టాండ్ల పరిస్థితీ దయనీయంగానే ఉంది. జనం రాకపోకలు రాత్రీ పగలు ఎక్కువగానే ఉన్నా, బస్టాండ్ల వద్ద ప్రయాణీకుల అవసరాలకు తగ్గట్లుగా సదుపాయాలు ఉండడం లేదు. రాత్రివేళల్లో బస్సులో దిగి ఇళ్లకు వెళదామంటే కొన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ప్రయాణీకులు కూర్చునేందుకు సరైన కుర్చీలు, బెంచీలు కూడా ఉండడం లేదు. బస్టాండ్లలో ఉండే తినుబండారాల దుకాణాలు, భోజన హోటళ్లలో నాణ్యత ఉండడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ఈ దుస్థితిని పరిశీలించి బస్టాండ్‌లలో కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

– ఆర్ఎస్ బాపయ్య, ఉదయగిరి.

# తెలుగు ప్రజల గుండెచప్పుడు.. ఎన్టీఆర్

## • స్వర్ణభారత్‌లో.. ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో వెంకయ్య ప్రశంస



వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో, భారత 13వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సమక్షంలో ఈనెల 13న ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఎన్టీఆర్‌ని నటుడిగానో, రాజకీయ నాయకుడిగానో తెలుగు ప్రజలు భావించరని, ఎన్టీఆర్ అంటే తెలుగువారి గుండె చప్పుడు అని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు అభివర్ణించారు. ఎన్టీఆర్ స్ఫూర్తి కాలానికి, సినిమాలకు, రాజకీయాలకు అతీతమైనదని, ఎన్టీఆర్‌ను ప్రజలు తెలుగు జాతికి వెలుగు దివిటీలు పట్టిన ధీరుడిగానే కలకాలం గుర్తుంచుకుంటారని ఆయన అన్నారు. 'యుగపురుషునికి శతవసంత నీరాజనం' పేరిట ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి అందరికీ ఎన్టీఆర్ విశిష్ట ఆదర్శాలను మరోసారి జ్ఞాపకం చేశారు. చక్కని స్ఫురద్రూపంతో పాటు ఎన్నో పురాణ, చారిత్రక పాత్రలకు ఎన్టీఆర్ వన్నె తీసుకొచ్చారని, ఎన్టీఆర్ నటించని పాత్ర లేదంటే అతిశయోక్తి కాదని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నటించిన 22 పురాణ పాత్రల గురించి ప్రస్తావించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు, పురాణపాత్రల రూపంలో ముందు తరాలకు మన సంస్కృతిని అర్థమయ్యే విధంగా ఆ మహానటుడు తెలియజేశారని పేర్కొన్నారు. తెలుగు భాషే తామిద్దరని దగ్గర చేసిందని గుర్తుచేసుకున్నారు. మాతృభాషను కాపాడుకోవటం ద్వారా ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అందించవచ్చని, ఎన్టీఆర్ అభిమానుల కుటుంబాలు తెలుగు మాట్లాడితే, ప్రతి తెలుగువాడు తెలుగుకు దగ్గరగా ఉన్నట్లేనని అన్నారు. రాజకీయాల్లోనూ ఎన్టీఆర్ స్థానం మరింత ప్రత్యేకమైనదని, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ పేరు, రూపం మార్చుకుని సుపరిపాలన భాగస్వామ్యమై ముందుకు సాగుతున్నాయని తెలిపారు. వెనుకబడిన వర్గాలు, మహిళల సాధికారత కోసం ఎన్టీఆర్ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుంటారని, సమగ్రమైన విధానాలను ప్రతిపాదించటం మొదలుకుని సంక్షేమ పథకాలు గడప గడపకూ చేరేవరకూ అలుపెరగకుండా ఎన్టీఆర్ శ్రమించారని ఆయన కొనియాడారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు పక్కా గృహాలు, సగం ధరకే జనతా వస్త్రాలు, ఉపాధి హామీ, పింఛన్లు, చిన్నకారు రైతులకు తక్కువ ధరకే విద్యుత్, మండల వ్యవస్థ నిర్మాణం, ప్రతి మండల కేంద్రంలో విద్య, వైద్య సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం, ఎంసెట్ నిర్వహణ, క్యాపిటేషన్ ఫీజు రద్దు, మద్యపాన నిషేధం వంటి ఎన్టీఆర్ పథకాల గురించి వెంకయ్యనాయుడు ప్రస్తావించారు. ముఖ్యంగా మహిళా సాధికారత కోసం ఎన్టీఆర్ చేసిన కృషి దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జయంతి అంటే ఎన్టీఆర్ చిత్రపటానికి దండ వేయటం కాదని, ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవటమేనని పేర్కొన్నారు. నటుడిగా ఇష్టపడి కష్టపడి పని చేసి ప్రజలకు చేరువ అయిన ఆయన, నాయకుడిగా ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్నారని గుర్తు చేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఎన్టీఆర్ స్ఫూర్తిని ముందు తరాలకు అందించగలమన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో యువతరం నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 54 మందికి ఒక్కొక్కరికి 5వేల రూపాయల వంతున చెక్కు, జ్ఞాపిక, ధృవీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం ప్రజల్లో మంచి ఆదరణ ఉన్న ఎన్టీఆర్ సినీ గీతాలతో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. ప్రఖ్యాత గాయకుడు ధూళిపాల ఆంజనేయ మిత్ర(డిఏ మిత్ర), సురేఖ పాడిన గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, సుప్రసిద్ధ సినీ దర్శకులు ఏ. కోదండరామిరెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపావెంకట్‌తో సహా పలువురు ట్రస్టీలు, ఎన్టీఆర్ అభిమానులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# 'నీట్'లో డాక్టర్స్ మెడికల్ అకాడమీ విజయభేరి



ఇటీవల ప్రకటించిన నీట్-2023 పరీక్షల్లో తిరుపతి-డాక్టర్స్ మెడికల్ అకాడమీ (కృష్ణారెడ్డి శ్రీచైతన్య అకాడమీ) విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో పాటు అత్యధిక మార్కులు సాధించి సంచలనం సృష్టించారు. తమ కళశాల నుంచి 80 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించబోతున్నారంటూ కళాశాల ఛైర్మెన్ బివి కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మెన్ పార్థీవ్ రెడ్డిలు, అకడమిక్ డైరెక్టర్ కె.రహీమ్ సంతోషం ప్రకటించారు. తమ కళాశాలలో బైపిసి చదివిన విద్యార్థులు నీట్‌లో 720 మార్కులకు గాను, మహమ్మద్ షరీఫ్ అజ్మీ 680 మార్కులు సాధించాడని, వి. వైష్ణవి 646, వి. అర్జున్‌రెడ్డి 632, కె.లీనాసాయి 627, ఎస్.విక్రమ్‌నటరాజ్ 621, ఎస్. త్రిలోక్‌రాజు 600 మార్కుల వంతున సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్నారని వారు ఆ విద్యార్థులను అభినందించారు. అంతేకాక, ఈ పరీక్షల్లో 550 మార్కులకు పైగా 25 మంది, 500 మార్కులకుపైగా 50 మంది, 450 మార్కులకు పైగా 150 మంది, మొత్తం 80 మందికి పైగా విద్యార్థులు మెడికల్‌సీట్లు సాధిస్తారని పేర్కొన్నారు. ఈ విజయాలకు కారణమైన విద్యార్థులతో పాటు, వారి తల్లితండ్రులను, అధ్యాపకులను వారు అభినందించారు.





| ADM NAME | HT.NO. | 2023-Neet Marks | 2022-Neet Marks | Diff. |
|---|---|---|---|---|
| CHINNI BALAJI | 230410319550 | 532 | 168 | 364 |
| MANDLA JAHNAVI | 230410815833 | 464 | 177 | 287 |
| SHAIK NAUSHAD RASHEED | 230410667991 | 601 | 320 | 281 |
| MOLAKALA CHERITH PREETHAM | 230410169017 | 596 | 318 | 278 |
| KAILASH KUMAR PRAJAPATH | 230410185082 | 534 | 259 | 275 |
| PODILI LAKSHMI CHANDANA | 230411294108 | 559 | 290 | 269 |
| SHAIK ASLAM | 230410336443 | 569 | 322 | 247 |
| MAHAMMAD NAVEED | 230410311340 | 460 | 217 | 243 |
| CHINNI KESAVA | 230410359904 | 590 | 352 | 238 |
| CHOWDAM LAKSHMI GANESH | 230411189889 | 549 | 311 | 238 |

# బాలు పాట-మాట ఏనాటికీ మరువలేనివి

## పద్మభూషణ్ కెఐ వరప్రసాద్‌రెడ్డి



ప్రముఖ గాయకుడు పాటూరు శ్రీనివాసులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రఖ్యాత సినీ నేపథ్యగాయకుడు, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు మధురాతిమధురాలని, బాలు పాటలు-మాటలు ఏనాటికీ మరువ లేనివని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాప కులు, పద్మభూషణ్ కెఐ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. బాలు జయంతిని పురస్కరించు కుని ఈనెల 11న నెల్లూరులోని 'రాగం-తానం-పల్లవి' స్వర సంగీత కళా సంస్థ ఆధ్వర్యంలో బాలును స్మరించుకుంటూ స్వరార్చన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లా డుతూ, బాలు తీయని కంఠస్వరం.. ఆ భగవంతుడు ఆయనకిచ్చిన వరమని కొనియాడారు. అనంతరం వరప్రసాద్ రెడ్డిని ఆ సంస్థ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివ ప్రభాత్‌రెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**మైమరపించిన బాలు పాటలు :**

బాలు అభిమానులు, బాలు మిత్రులు, ఆ సంస్థ నిర్వాహకులు టి.జనార్దన్, ఐ.ఉమామహేష్, రాయసం రమేష్, ఎస్ కనకరాజు, గాయనీమణులు లక్ష్మి, విజయ లక్ష్మి, శ్రీవల్లి తదితరులు ఈ సందర్భంగా పలు సినిమాల్లో బాలు పాడిన పాటలను హృద్యంగా గానం చేసి అందరి కరతాళ ధ్వనులందుకున్నారు. అనంతరం ప్రముఖ గాయకులు పాటూరు శ్రీనివాసులు, ఎంకె ప్రసాద్, జీవి మురళి, రావిప్రోలు సుబ్ర హ్మణ్యం (సుబ్బయ్య), కణ్ణన్ తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీవి మురళి(చెన్నై), వైకె మురళి (హైదరాబాద్), ఎంకె ప్రసాద్ (నెల్లూరు), దూబగుంట రామకృష్ణ (తిరుపతి), ఎస్‌వి సుబ్బారావు (చెన్నై), సి.కణ్ణన్ (చెన్నై), ఆర్.సుబ్రహ్మణ్యం (విశాఖ), విశ్వం (నెల్లూరు) తదితరులు పాల్గొని బాలుతో తమకున్న స్నేహాభిమానాన్ని గుర్తు చేసుకున్నారు.

# అర్హులైన వారందరికీ..సంక్షేమ పథకాలు

## - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఈనెల 15న ఆయన వెంకటగిరి మండలం లోని చింతగుంట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి, ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, తాము అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు తీర్చేందుకు కృషిచేస్తామని అన్నారు. అనంతరం వెంకటగిరి మండలంలోని గుండ్లసముద్రం ఎస్‌సి కాలనీ, గుండ్లసముద్రం ఎస్‌టి కాలనీ, చింతగుంట ఎస్‌సి కాలనీ, తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు, మహిళలకు ప్రభుత్వ సంక్షేమపథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు రామ్‌కు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులిచ్చి సాదరంగా స్వాగతించారు. పలుచోట్ల ప్రజలు గజమాలలతో ఆయన్ను సత్కరించారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయంటూ మెచ్చుకున్నారు.

# నైపుణ్యాభివృద్ధికి శిక్షణ

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ సహకారంతో విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించటంపై ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులకు 3 రోజుల శిక్షణా కార్యక్రమం ఈనెల 15న ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 35మంది ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయ ఆనందకుమార్‌బాబు అధ్యక్షత వహించగా, రిజిస్ట్రార్ ఆచార్య పి.రామ చంద్రారెడ్డి, రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డా. పి.అశోక్‌రెడ్డి, రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆచార్యులు ఆచార్య వాసంతి రాజేంద్రన్ అతిథులుగా పాల్గొన్నారు. డా. ఉదయ్‌శంకర్ కార్యనిర్వాహకుడిగా వ్యవహరించారు.

## టౌన్‌హాల్ ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో..

# 18న విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా నెల్లూరులోని శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం (టౌన్‌హాల్) ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో, ఇటీవల కార్పొరేషన్ పరిధిలో 10వ తరగతిలో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని ట్రస్ట్‌బోర్డు సెక్రటరీ జెఎస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 35 మునిసిపల్, జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలల్లో ఉత్తీర్ణతలో ప్రథమస్థానం సాధించిన ఒక్కొక్క విద్యార్థికి 5వేల రూపాయల వంతున నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను కూడా అందజేస్తామని, ఈనెల18వతేదీ ఆదివారం సాయంత్రం 4గంటలకు టౌన్‌హాల్‌లో జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు ఆ ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేస్తామని, ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

## కామాక్షితాయికి..

# లక్ష కుంకుమార్చన

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీమల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 14న లక్ష కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు. కొత్తవెల్లంటి వాస్తవ్యులు కోట దేవేందర్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో అలంకరించి, ఆలయ మహా మండపం వద్ద 20 మంది ఋత్విక్కులతో పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకు న్నారు. ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి వారు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# మునిసిపల్ కార్మికుల ఆందోళన

తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కోరుతూ అనేకమంది మునిసిపల్ కార్మికులు ఈనెల 13న నెల్లూరులోని జనార్దన్‌రెడ్డికాలనీలో ఆందోళన చేపట్టారు. సిపిఎం నగర కార్యదర్శి, మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. వైఎస్ జగన్ పాదయాత్రలో ఉన్నప్పుడు మునిసిపల్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, ఆ తర్వాత సిఎం అయ్యాక ఆ హామీని విస్మరించి ప్రజలకు నమ్మకద్రోహం చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకులు మూలం ప్రసాద్, ఎన్ వెంకటేశ్వర్లు, శైలజ తదితరులు పాల్గొన్నారు.



# వీరనారి.. పొణకా కనకమ్మ

## కొనియాడిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధురాలు పొణకా కనకమ్మ వీరనారి అని, స్వాతంత్ర్యోద్యమంలో ఆమె చేసిన పోరాటం అనితరసాధ్యమని, అంతేకాకుండా స్త్రీల విద్యకోసం చేసిన ఆమె చేసిన అమోఘమైన కృషి ఏనాటికీ విస్మరించరానిదని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పొణకా కనకమ్మ 132వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఇటీవల పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత, కనకమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెల్లూరులో ఆరోజుల్లోనే ఆమె కస్తూరిదేవి విద్యాలయాన్ని ఏర్పాటుచేసి ఆడపిల్లల చదువులకు ఎంతో ప్రోత్సాహం అందించారని, స్వాతంత్ర్యపోరాటంలో భాగంగా పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని స్థాపించి గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించారని ఆయన కొనియాడారు. ఆ తర్వాతకాలంలో గాంధీ ఆశ్రమం అభివృద్ధికి గణేశం కృష్ణారెడ్డి-కల్పనమ్మ దంపతులు ఎంతో కృషి చేశారని ఆయన తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్‌గానే కాకుండా, ఎమ్మెల్సీగా చట్టసభల్లో పల్లిపాడు గాంధీ ఆశ్రమ విశిష్టతను ప్రస్తావించి ఆశ్రమం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. అనంతరం ఆశ్రమ కమిటీ సభ్యురాలు రాజేశ్వరమ్మ వృద్ధాశ్రమం ఏర్పాటుకు 3 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు గునపాటి ప్రసాద్‌రెడ్డి, గణేశం సుమంత్‌రెడ్డి, కో-కన్వీనర్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సిసి కేడెట్లకు షిప్ మోడలింగ్‌లో శిక్షణ



నెల్లూరులోని 10-ఆంధ్ర నావల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కమాండర్, క్యాంప్ కమాండెంట్ వినయ్ రామచంద్రన్ సారథ్యంలో ఇటీవల నార్త్ రాజుపాలెంలో జరుగుతున్న ఏడవ వార్షిక శిక్షణా శిబిరంలో కేడెట్లకు షిప్ మోడలింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఇన్‌స్ట్రక్టర్ ఎస్.వి రామన్ నౌకా నిర్మాణం ఎలా చేస్తారో, దానిలో ఏయే భాగాలుంటాయో, ఆ నమూనాను ఎలా నిర్మిస్తారో కేడెట్లకు వివరించారు. ఈ నమూనాను తయారు చేసిన కేడెట్లు పి.హరీష్, పి.లావణ్యలను అభినందించారు. కేడెట్లకు డ్రిల్ టెస్ట్, సీమెన్ షిప్ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు పోటీలు, ఉదయం యోగాసనాలు వేయించారు. డ్రిల్ శిక్షణ, నావిగేషన్, నావెల్ ఓరియంటేషన్ తదితర అంశాలపై కేడెట్లకు శిక్షణ ఇచ్చారు. ఎన్‌సిసి అధికారులు ఎస్‌కే. ఖాదర్‌బాషా, గుండాల నరేంద్రబాబు, సి.వి.నాగరాజు, విద్యాసాగర్, మస్తానయ్య, కేర్ టేకర్ ప్రళయ కావేరి సుస్మిత, పి.ఐ.స్టాఫ్ నీలేష్, వెంకటేష్ రాథోడ్, శివప్రసాద్, సూరజ్ బగేల్, హవల్దార్ బ్రిజ్‌పాల్‌సింగ్, అనీల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆనందయ్యకు 'సేవారత్న' పురస్కారం



నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, కరోనాలో ఎంతోమందిని ఆదుకున్న బొనిగి ఆనందయ్యకు నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, మా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లోని 'మా ఫౌండేషన్' కార్యాలయంలో 'సేవారత్న' అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సినీ దర్శకులు మహేష్‌చంద్ర మాట్లాడుతూ కరోనా కష్ట సమయంలో ఎంతోమందికి కరోనా నివారణకు మందును ఉచితంగా అందించి ఎందరినో కాపాడి ఆనందయ్య అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.జయరాం మాట్లాడుతూ ఆనందయ్య సేవలను అభినందించారు. దోనేపూడి వరప్రసాద్, కె.మురళీమోహన్‌రాజు, లయన్ ఎస్.రామచంద్రరావు, వాసిరెడ్డి హనుమంతరావు, దుర్గేష్, ఓంకారం శివసాయి కుమార్‌రాజు, దోనేపూడి రవితేజ, డి.ఝాన్సీ, డాన్స్‌మాస్టర్ రజిత, అలియాభాను, ఖాసీఫాభాను తదితరులు పాల్గొన్నారు.

# ఆద్యంతం గురుభక్తితో సాగిన.. 'గురు వందనం'

- గురుస్మరణ చేసుకున్న వెంకయ్య
- స్వర్గీయ మోపూరు వేణుగోపాలయ్యకు ఘన నివాళి

**తమకు పాఠాలు, జీవితపాఠాలు నేర్పిన ఆత్మీయ గురువును స్మరించుకుంటూ, ఆ గురువుల పట్ల వినయ విధేయతలున్న శిష్యులు ఎంత శ్రద్ధగా వారి స్మారక కార్యక్రమం నిర్వహిస్తారో, అంతటి భక్తితోనే జరిగింది మొన్నటి 'గురువుకు వందనం' కార్యక్రమం. నెల్లూరు విఆర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేశాక కూడా తన ఆధ్యాత్మిక కార్యక్రమాలను దాదాపు రెండు దశాబ్దాలకు పైగా అలుపెరుగక నిర్వహించిన అక్షరయోధుడు, ఆధ్యాత్మిక ప్రవచనకారుడు స్వర్గీయ మోపూరు వేణుగోపాలయ్యను స్మరించుకుంటూ ఆయన ఆత్మీయబృందం 300పేజీలతో ఒక సాహితీ సంచికను రూపొందించడం, దానిని ఆ గురువర్యునికి శిష్యులైన భారత 13వ ఉపరాష్ట్రపతివర్యులు ముప్పవరపు వెంకయ్యానాయుడు ఆవిష్కరించడం, ఈ సందర్భంగా ఆయన తమ గురువులను స్మరించుకోవడం, ఇంతటి విశిష్టత కలిగిన ఈ సభలో పద్మభూషణులు కెఐ వరప్రసాద్‌రెడ్డి, 'మనసు ఫౌండేషన్' అధినేత ఎం.వి రాయుడు, 'లాయర్' పత్రిక అధిపతి తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులు పాల్గొని గురువుల వైశిష్ట్యాన్ని తెలియజేస్తూ ప్రసంగించడం నెల్లూరీయులను, ప్రత్యేకించి సాహిత్యాభిలాషులను బాగా ఆకట్టుకుంది. నెల్లూరు మండల ప్రజాపరిషత్ ప్రథమ అధ్యక్షులు టి. రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమమంతా ఆద్యంతం గురుభక్తితో సాగి, మోపూరు వేణుగోపాలయ్యకు ఘనమైన నివాళిని అర్పించింది. నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం అందుకు వేదికగా నిలిచింది.**




జూన్ 12, సోమవారం ఉదయం నెల్లూరులో స్వర్గీయ మోపూరు వేణుగోపాలయ్య స్మృత్యంకంగా 'గురువుకి వందనం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన స్మారకంగా "ప్రవచన సుధాకరుని 'వేణు'నాదం" అనే పేరుతో రూపొందించిన సాహితీ సంచికకు భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతులమీదుగా ఆవిష్కరణ జరిగింది. సాహిత్యాభిమానులు, ఎందరో గురువులు, మోపూరు వేణుగోపాలయ్య సన్నిహితులు, ఆత్మీయులు, వారి కుటుంబ సభ్యులతో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం క్రిక్కిరిసిపోయింది. అందరి ప్రముఖుల సమక్షంలో ఆ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ జరగడం పట్ల సాహితీలోకం తమ హర్షాతిరేకాలను వెల్లడించింది. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడి ఒక్కొక్కమాట ఒక్కో ఆణిముత్యంగా భాసిస్తూ గురువులందరికీ ఎనలేని సంతోషాన్ని తెచ్చిపెట్టింది. ప్రత్యేకించి తెలుగుభాష పట్ల ఆయనకున్న మమకారం మరోసారి ప్రతి పదంలోనూ వెల్లువెత్తింది. 'భాషంటే శ్వాస లాంటిదని, భాషే లేకుంటే మనుగడ ఉండదని, భాషను మనం మరిచిపోతే మనల్ని మనమే మరిచిపోయినట్లేనని, కమ్మనైన మన అమ్మభాషను..తియ్యనైన మన తెలుగుభాషను ఎవరూ విస్మరించవద్దని' ఆయన ఈ సందర్భంగా పదేపదే చెప్పారు. మాతృభాషలోనే పరిపాలన జరగాలని, వాడుక భాషను ప్రోత్సహించాలని ఆయన ఆకాంక్షించారు. విఆర్ కళాశాలలో తాను చదువుకుంటున్నప్పుడు తన గురువులైన పోలూరి హనుమజ్జానకీరామ శర్మ, మోపూరు వేణుగోపాలయ్యల వంటి గురువుల మార్గదర్శనం వల్లనే తన ఇంత వాడినైనానని ఆయన వినమ్రంగా చెప్పుకున్నారు. అప్పట్లో అయ్యవార్లు గురుశిష్యుల బంధంతో ఎంతో ఆత్మీయంగా ఉండేవారని, గురువులకు శిష్యుల పట్ల వాత్సల్యం, ప్రేమ ఉండేవని ఆయన గుర్తుచేసుకున్నారు. సత్సాంగత్యం, సద్వివేచన, సద్బుద్ధి, సన్మార్గం అన్నీ అలాంటి గురువుల వల్లే లభిస్తాయన్నారు. తెలుగు మాస్టారుగా, ప్రవచన సుధాకరునిగా అందరి అభిమానాన్ని పొందిన మోపూరు వేణుగోపాలయ్య ఆదర్శాల బాటలో అందరూ నడవాలని, అదే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. పద్మభూషణులు వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, మన తెలుగుభాష దాదాపు 7వేల సంవత్సరాల నాటిదని,




అంతటి ప్రాచీనమైన తెలుగుభాషను నేటికీ, ఏనాటికీ కూడా మరచిపోకూడదన్నారు. పరాయిపాలనలో మన తెలుగుభాష ప్రాశస్త్యాన్ని పోగొట్టుకున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా తెలుగుభాష కనుమరుగు కాకుండా అందరం కాపాడుకోవాలని, అందుకు తెలుగుభాష పట్ల అనురక్తిని కలిగించే స్వర్గీయ వేణుగోపాలయ్య వంటి గురువులు ఎంతో అవసరమని అన్నారు. మనసు ఫౌండేషన్ అధినేత ఎం.వి.రాయుడు మాట్లాడుతూ, ఈ సందర్భంగా ఆవిష్కరించిన 'ప్రవచన సుధాకరుని 'వేణు' నాదం' సాహితీసంచిక మోపూరు వేణుగోపాలయ్యకు నీరాజనాలర్పిస్తూ, విశిష్టమైన సాహితీ వ్యాసాల సౌరభాలతో అందరినీ ఆకట్టుకుంటుందని అన్నారు. 'స్వర్గీయ వేణుగోపాలయ్య వంటి ఒక మహనీయునికి నివాళులర్పించేందుకు ఇంతమంది మహానుభావులు తరలి రావడం సంతోషంగా ఉందని' ఈ కార్యక్రమంలో పాల్గొన్న 'లాయర్' పత్రికాధిపతి తుంగా శివప్రభాత్‌రెడ్డి అన్నారు. టి.రమణయ్య స్వాగత వచనాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలుత, విఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు, పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్ర ప్రసాద్ పాల్గొని 'మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక కమిటీ' తరఫున వెంకయ్యానాయుడును, వరప్రసాద్ రెడ్డిని దుశ్శాలువలతో సత్కరించారు. సాహితీ సంచిక తొలి ప్రతులను వేణుగోపాలయ్యకు ఆత్మీయులైన మెట్టు రామచంద్రప్రసాద్, కొండా వెంకటస్వామి, ప్రసాద్‌లకు వెంకయ్యానాయుడు బహుకరించారు. తొలుత 'గానం అకాడమీ' విద్యార్థి నులు, ఏ.లక్ష్మీ ప్రసన్న శిష్యబృందం జ్ఞానశ్రీ, వాసవి, శృతి, వైష్ణవి, శ్రీకృతి తదితరుల అన్నమాచార్యుల కీర్తనాలాపనలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'కళాంజలి' అనంత్ సారథ్యంలో ఈ సంగీత విభావరి అద్భుతంగా జరిగింది. అనంతరం మెట్టు రామచంద్రప్రసాద్ వందన సమర్పణ చేశారు. జాతీయగీతాలాపనతో సభా కార్యక్రమం ముగిసింది.




## కమిటీ సభ్యులకు వెంకయ్య అభినందనలు

ప్రవచన సుధాకరుని 'వేణు'నాదం గ్రంథాన్ని వెలువరించేందుకు కీ.శే. మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక కమిటీ ఏర్పడి, ఆ గ్రంథాన్ని సర్వాంగసుందరంగా రూపొందించింది. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, సాహితీవేత్తలు టి.రమణయ్య, కొండా వెంకటస్వామిరెడ్డి, మల్లేల శ్రీహరి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, బండ్ల రమణయ్య, నలుబోలు బలరామయ్యనాయుడు, మర్మావుల సుబ్రహ్మణ్యం, మద్దూరు శ్రీనివాసులు, తూపిలి రవీంద్రబాబులతో పాటు వేణుగోపాలయ్య కుటుంబసభ్యులు వరదరాజు శ్రీధర్, మోపూరు శ్రీకాంత్‌లు ఈ కమిటీలో సభ్యులుగా ఉండి తమవంతు సేవలు అందించినందుకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముప్పవరపు వెంకయ్యానాయుడు వారందరినీ అభినందించారు.

## వెంకయ్యను కలుసుకున్న.. మాడభూషి సంపత్‌కుమార్



భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి, ముప్పవరపు వెంకయ్యానాయుడును వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈనెల 13న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ కలుసుకున్నారు. కేంద్ర విద్యాత్మక, కార్యనిర్వాహక సిబ్బందితో పాటు ఆయన వెంకయ్య నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు తెలుగు భాషా సాహిత్యాల మీద కేంద్రంలో జరుగుతున్న పరిశోధనల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం తెలుగు భాషా సాహిత్య ప్రాచీనత, సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని భవిష్యత్ పరిశోధకులకు, భాషాభిమానులకు అందించే ఆకరంగా తయారవ్వాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. స్థానీయమైన భాషాపరిమళాల్ని గుర్తించి, వాటి ఔన్నత్యాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని ఆయన తెలిపారు. ఆ సంస్థకు సహాయ సహకారాలను ఎల్లవేళలా అందిస్తానని వెంకయ్య నాయుడు వారికి భరోసా ఇచ్చారు.




# వైభవంగా వెంగమాంబాదేవి బ్రహ్మోత్సవాలు

జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన దుత్తలూరు మండలం నర్రవాడలో శ్రీ వెంగమాంబాదేవి పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈనెల 11న వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు వేడుకగా జరిగిన ఈ ఉత్సవాల్లో తొలిరోజు కార్యక్రమంలో భారత 13వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ ధర్మకర్తలు, కార్య నిర్వహణాధికారి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. ఉత్సవాల్లో మొదటిరోజు నిలుపు కార్యక్రమం వేడుకగా జరిగింది. వడ్డిపాళెంలోని అమ్మవారి పుట్టినిల్లయిన పచ్చవ వారి ఇంట్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పసుపు దంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వెంగమాంబాదేవి వంశస్తులు, భక్తులు పసుపు కుంకుమలను ఊరేగింపుగా వెంగమాంబాదేవి అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా సంతానం కోసం మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి మొక్కులు మొక్కుకున్నారు.

**వెంకయ్యనాయుడు దంపతుల ప్రత్యేక పూజలు**





## ప్రజలు మనీతో కాదు..
# మనసుతో గెలిపించారు
**- వెంకయ్య**

ఉదయగిరి ప్రజలు తననెంతో అభిమానించి ఆశీర్వదించారని, మనీతో కాదు మనసుతో గెలిపించారని, వారి ఆశీస్సులతోనే తాను ఉదయగిరి నుంచి ఉప రాష్ట్రపతి స్థాయి దాకా ఎదిగానని, ఉదయగిరి ప్రజలను తాము ఎన్నటికీ మరువలేమని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా చెప్పారు. వెంగమాంబాదేవి ఆలయంలో ఉన్న కల్యాణ వేదికపై ఆయన ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 1977 పార్లమెంట్ ఎన్నికల్లోనూ, 1978-83 అసెంబ్లీ ఎన్నికల సందర్భంలోనూ ఇక్కడి ప్రజలు తనకు అండగా నిలిచారన్నారు. తాను ఏ గ్రామానికి వెళ్ళినా అన్నివర్గాల ప్రజలు ఘనస్వాగతం పలికేవారని ఆయన గుర్తుచేసుకున్నారు. ఉదయగిరి ప్రజలు నీతినిజాయితీలతో ఉంటారని, వారి ప్రేమాభిమానాలను, ఆత్మీయతను తాను, తన కుటుంబ సభ్యులు ఏనాటికీ మరువలేమన్నారు. అనంతరం వెంకయ్యనాయుడును స్థానిక ప్రముఖులు ఆత్మీయంగా సత్కరించారు.

# డీకే డబ్ల్యూ కళాశాల జిల్లాకే గర్వకారణం



నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జిల్లాకే గర్వకారణమని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రశంసించారు. ఇటీవల జరిగిన డికెడబ్ల్యు కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో డీకే కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉండడం సంతోషకరమని, ఎంతోమంది మహిళలు ఈ కళాశాలలో చదువుకొని నేడు ఉన్నత స్థానాలనధిరోహించారని ఆయన చెప్పారు. డీకే కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్సీగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. భవిష్యత్తులో ఈ కళాశాల మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ గిరి, అధ్యాపక బృందం సన్మానించారు. అధ్యాపక వృత్తిలో ప్రతిభ చూపిన పలువురు అధ్యాపకులకు ఈ వార్షికోత్సవ వేడుకల్లో వారు జ్ఞాపికలు బహుకరించారు.

# డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో.. రక్తదానం

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జూన్ 14న నెల్లూరులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సంస్థ ఏర్పాటుచేసిన ఈ రక్తదానశిబిరంలో డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య పాల్గొని మాట్లాడారు. రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైద్యాధికారి డాక్టర్ జయసింహ, డాక్టర్ హరిశ్చంద్ర సతీష్, డిసిఎంఓ డాక్టర్ సునీల్, డెమో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సందేశాత్మక కవితా సంపుటి.. 'దాహం..దాహం'

**కవి చిన్ని నారాయణరావును అభినందించిన పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి**



నెల్లూరులోని ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు రచించిన 'దాహం..దాహం' దీర్ఘ కవితా సంపుటి సందేశాత్మకమైనదని, సామాజిక కోణంలో రచించిన ఈ దీర్ఘకవిత ప్రతిఒక్కరిని సంస్కరిస్తుందని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ కెఐ వరప్రసాద్‌రెడ్డి ప్రశంసించారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని మినర్వా హోటల్‌లో ఆ కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ పుస్తకంలో కవి రాసిన అనేక దాహాల శీర్షికలను ప్రస్తావిస్తూ, సెల్‌ఫోన్ దాహం ప్రతిఒక్కరిలో ఉందని చెప్పారు. కవి నిబద్ధతకు ఈ కవితలు నిదర్శనమన్నారు. అనంతరం కవి చిన్ని నారాయణరావును దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.

ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో 'లాయర్' పత్రికాధిపతి తుంగా శివప్రభాత్‌రెడ్డి, చార్టర్డ్ అకౌంటెంట్ చిన్ని శ్రావణ్ కుమార్, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి, కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, అవ్వారు శ్రీధరబాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, టి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.








# స్థిరమైన అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉంది

**● సియోల్ సదస్సులో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి**



భారతదేశం స్థిరమైన అభివృద్ధికి తన నిబద్ధతను ప్రదర్శించే అనేక పరివర్తన కార్యక్రమాలను, మరియు విధానాలను అమలుచేసిందని, నేటితరం.. భావితరాల కోసం భూమిపై స్థిరమైన జీవితాన్ని నిర్ధారించడానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ ప్రయత్నాలకు సహకరించడానికి భారతప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. దక్షిణకొరియాలోని సియోల్‌లో జరుగుతున్న ఆసియా-పసిఫిక్ పార్లమెంటేరియన్ల 20వ సాధారణ సమావేశం (ఏపీపీసీఈడి)లో ఆయన ఈనెల 14న జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని భారత్ తరపున తన వాణిని వినిపించారు. భారతదేశం ఇప్పటికే ప్యారిస్ ఒప్పందం ప్రకారం 2030 వరకు ఎన్‌డిసిల నిబద్ధతలను సమర్పించిందని పేర్కొన్నారు. పర్యావరణ వ్యవస్థ పరిరక్షణలో అడవుల కీలకపాత్రను భారతదేశం గుర్తించిందని, గ్రీన్ ఇండియా మిషన్, నేషనల్ పారెస్ట్రేషన్ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాలు అటవీ విస్తీర్ణాన్ని విస్తరించడంలో భారతదేశ నిబద్ధతకు నిదర్శనమని ఆయన వివరించారు. ఆరోగ్యకరమైన, స్థిరమైన జీవనవిధానాన్ని ప్రచారం చేయడానికి భారత్ అంకితభావంతో కృషిచేస్తోందన్నారు. 'క్లీన్ ఇండియా' ప్రచారం దేశంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో, కాలుష్యాన్ని తగ్గించడంలో, వాతావరణ మార్పుల యొక్క ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో విశేషమైన పురోగతిని సాధించిందని ఆయన చెప్పారు. వాతావరణ మార్పుల ముప్పును ఎదుర్కోవడానికి ప్రపంచ ప్రయత్నాల్లో భారతదేశం ఒక ఆశాకిరణంగా ఉందని ఆయన వివరించారు. సుస్థిర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించే మన ప్రయత్నాలకు సంబంధించి ఈ సదస్సులో జరుగుతున్న చర్చలు ఫలవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

# రక్తదానం చేసిన ట్రైనీ కలెక్టర్ విద్యాధరి



నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్ విద్యాధరి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈనెల 12న ఆమె రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న బ్లడ్‌బ్యాంక్‌ను, మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని తలసేమియా సెంటర్‌లను సందర్శించి అక్కడ వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట రెడ్‌క్రాస్ కార్యదర్శి మస్తానయ్య, తలసేమియా సెంటర్ కన్వీనర్ సీత, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ ఐలాకు.. ఐమాప్ అంబులెన్స్ వితరణ



శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ (ఐమాప్) ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ(ఐలా)కు రూ.29 లక్షల విలువైన నూతన అంబులెన్స్‌ను వితరణగా ఇచ్చింది. ఈనెల13న పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ తైజో ఇవామీ, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపిఐఐసి) జోనల్ మేనేజర్ చంద్రశేఖర్‌కు అంబులెన్స్ తాళాలను అందజేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవ, సూచనల మేరకు ఈ ప్రాంతంలో ఆరోగ్య సామాజిక మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి తమ వంతు బాధ్యతగా తమ సీఎస్సార్ చర్యలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తైజో ఇవామీ పేర్కొన్నారు. అంబులెన్సు వితరణ పట్ల ఐమాప్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపిన చంద్రశేఖర్, స్థానిక ప్రజలకు సేవలందించడానికి ఈ అంబులెన్సును వినియోగిస్తామని చెప్పారు. అత్యవసర వైద్య సదుపాయాల నిమిత్తం అధునాతన వసతులు కలిగిన అంబులెన్సును వితరణగా ఇచ్చినందుకు ఐమాప్ మరియు శ్రీసిటీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, సెక్యూరిటీ & విజిలెన్స్ హెడ్ వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## విద్యార్థులు ప్రతిభతో రాణించాలి

### --- వేమిరెడ్డి దంపతుల ఆకాంక్ష ---



విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలమని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఇటీవల నెల్లూరులోని విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విపిఆర్ విద్య' పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వేమిరెడ్డితో పాటు ఆయన సతీమణి, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని 6 నుంచి 10వ తరగతి దాకా చదువుకుంటున్న విద్యార్థులకు పుస్తకాల కిట్‌లు, స్కూల్‌బ్యాగ్‌లు బహుకరించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలనే సదుద్దేశంతో ఈ పాఠశాలను స్థాపించామని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రతిభతో రాణించాలని ఆకాంక్షించారు. ఈ పాఠశాలలో విద్యార్థులందరికీ నైతిక విలువలతో కూడిన విద్య బోధిస్తున్నామని, పదవ తరగతి పరీక్షల్లో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థికి, ఆ తర్వాత ఉన్నత చదువుల్లో కూడా తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల క్రమశిక్షణ, చదువు విషయంలో తల్లిదండ్రులు రాజీపడవద్దని, కష్టపడి వారిని చదివించినప్పుడే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య విద్యార్థులకు

## ఉచిత భోజనం, వసతి

నెల్లూరు నగరంలోని పప్పుల వీధిలో ఉన్న శ్రీ పాండురంగ అన్నదాన సమాజం వారి హాస్టల్ భవనంలో 2023-24 విద్యా సంవత్సరానికి ఉచితంగా హాస్టల్ వసతి, భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నామని, ఆర్థికంగా వెనుకబడిన ఆర్య వైశ్య విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుందని, అర్హులైన వారు ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 25న తుదిజాబితా ప్రకటిస్తామని, వివరాలకు పాండురంగ సమాజం కార్యాలయంలో సంప్రదించాలని శ్రీ పాండురంగ అన్నదాన సమాజం కార్యదర్శి చలువాది వేంకటేశ్వర్లు (వైభవ్ శ్రీను), హాస్టల్ ఛైర్మెన్ వాయుగుండ్ల హజరత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

### రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

## రక్తదాతల దినోత్సవం

రోటరీక్లబ్-నెల్లూరు సౌత్ ఆధ్వర్యంలో ఈనెల 14న రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాతలను సన్మానించారు. ప్రముఖ రక్తదాత, 88 సార్లు రక్తదానం చేసిన ఎం.సతీష్ కుమార్‌ను సత్కరించి అభినందించారు. రక్తదానం విశిష్టతను గురించి ఈ సందర్భంగా వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు నరసింహారావు, గాదంశెట్టి గోపాల్, ఎంవి రెడ్డి, అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.




## 'నీట్'లో 'విశ్వసాయి' విజయకేతనం

ఎన్‌టిఏ వారు ఇటీవల ప్రకటించిన జాతీయ స్థాయి నీట్-2023 ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో తమ ప్రతిభను చాటుకున్నారు. తమ కళాశాలకు చెందిన కె.జీవన్‌రెడ్డి అనే విద్యార్థి 613 మార్కులు సాధించాడని, అదేవిధంగా సుహితక్ అనే విద్యార్థి 597 మార్కులు కైవశం చేసుకున్నారని, కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌లు సంతోషం వ్యక్తం చేస్తూ ఆ విద్యార్థులను అభినందించారు. తమ కళాశాల నుంచి మొత్తం 101 మంది విద్యార్థులు ఎంబిబిఎస్, బిడిఎస్‌లలో చేరడానికి అర్హత సాధించగలరని భావిస్తున్నామన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను, అందుకు కారణమైన వారి తల్లితండ్రులను, అధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని వారు అభినందించారు.

## నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలు.. స్ఫూర్తిదాయకం

రెడ్‌క్రాస్ సంస్థ సేవలు స్ఫూర్తిదాయకమని, తన సేవలతో నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ దేశవ్యాప్తంగా మంచిపేరు తెచ్చుకుందని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అభినందించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న ఆయన నెల్లూరు రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రక్తదానం చేయడంలోని విశిష్టను యువత అర్థం చేసుకోవాలని, రక్తదానం చేయడమంటే మరోమనిషికి జీవనదానం చేయడమేనని ఆయన చెప్పారు. రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలన్నారు.

రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ అనేక రకాలైన సేవాకార్యక్రమాలను చేపట్టి, బాధితులకు, రోగులకు తనవంతు సేవలందించి రాష్ట్రవ్యాప్తంగా గొప్ప పేరు



తెచ్చుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని అన్నారు. అందుకు సహకరిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులకు, మోటివేటర్లకు, జిల్లా ఉన్నతాధికారులకు అందరికీ ఆయన తన కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత, రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యునాట్, రక్త గ్రూపులు కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్‌ల్యాండ్ స్టైనర్ చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 59వ భాగం




ఖాండవారణ్య దహనంలో తక్షకుడి తల్లి, తన కుమారుడు, అశ్వసేనుణ్ణి కాపాడాలని వాణ్ణి నోట కరుచుకుని పారిపోతుంటే, ఒక బాణంతో ఆమెను సంహరిస్తాడు అర్జునుడు. కానీ ఇంద్రుడు మాయ చేసి తక్షకుడి కొడుకుని రక్షిస్తాడు. ఇంద్రుడు గంధర్వ, గరుడ, యక్ష వీరులతో కృష్ణార్జునుల మీద విరుచుకుపడతాడు. అర్జునుడు వారినందరిని తరిమికొడతాడు. అప్పుడు అశరీరవాణి ఇంద్రునితో, కృష్ణార్జునులిద్దరూ పూర్వం నరనారాయణులని, వారితో యుద్ధంలో నిలవలేవని హెచ్చరిస్తుంది. దాంతో ఇంద్రుడు తిరిగి తన లోకానికి వెళ్ళిపోతాడు.

ఆ అరణ్యంలోనే మాయాసురుడు అనే రాక్షసుడు తప్పించుకుందామని ప్రయత్నించినప్పుడు శ్రీకృష్ణుడు తన చక్రాయుధంతో చంపబోతే, అతడు అర్జునుని శరణు కోరితే అర్జునుడు అభయమిచ్చి రక్షిస్తాడు. మందపాలుడనే మునీశ్వరుడు పిల్లల కోసం లావుక పక్షిగా మారి ఇంకో ఆడ పిట్ట జరితతో ఆ అరణ్యంలో నలుగురు పక్షి కుమారులను కంటాడు. అరణ్య దహనం ముందుగా తెలుసుకుని, అగ్నిదేవుణ్ణి ప్రార్థించి తన పిల్లల్ని రక్షించమని కోరతాడు. తర్వాత తన మానవభార్య లిపిత దగ్గరకు వెళ్ళిపోతాడు. అరణ్య దహనం మొదలవగానే అగ్నిదేవుడు ఆ పిల్లల్ని దహనం చెయ్యకుండా వదిలేస్తాడు.

ఖండవారణ్య మూలికల్ని స్వేచ్ఛగా తిన్న తర్వాత అగ్నిదేవునికి అజీర్ణ రోగం పోతుంది. మళ్ళీ ఇంద్రుడు ప్రత్యక్షమై అర్జునునికి ఎన్నో అస్త్రాలు బహుకరిస్తాడు. కృష్ణార్జునులిద్దరు మాయాసురునితో కలిసి ఇంద్రప్రస్థం వెళ్ళిపోతారు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**






### గురుశిష్యుల అనుబంధం

తన గురువు, వి.ఆర్ కళాశాల విశ్రాంత ఆంగ్లోపన్యాసకులు వి.ఎస్.రామచంద్రరావును నెల్లూరులోని వారి నివాసంలో ఈ నెల 12న గౌరవపూర్వకంగా కలుసుకుని గురువర్యుని క్షేమసమాచారాలు అడిగి తెలుసుకుంటున్న శాంత బయోటెక్నిక్స్ అధినేత 'పద్మభూషణ్' కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి

## గరుడవాహనంపై గురువాయురప్ప

నెల్లూరు, వేదాయపాళెంలోని అయ్యప్ప గుడిలో వేంచేసి ఉన్న మహావిష్ణుస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గురు వాయూర్ మహావిష్ణు స్వామివారు గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.



అనంతరం స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. మంగళవాద్యాలు, కోలాటం, భజనబృందాల నడుమ స్వామివారి నగరోత్సవం కన్నులపండువగా జరిగింది. భద్రాచలం శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం స్థానాచార్యులు శ్రీమాన్ కొమందూరు ఇళయవల్లి స్థల శాయి స్వామి వారి ఆధ్వర్యంలో ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మహావిష్ణు స్వామివారికి తిరుమంజనం, సహస్రనామార్చన పూజలు వైభవంగా జరిగాయి. పిడూరు కిషోర్‌రెడ్డి-శరణ్య దంపతులు, అరుణమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఛైర్మెన్ గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, బొగ్గుల మురళీమోహన్‌రెడ్డి, కేజీ శంకర్, సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

# వైద్యరంగానికి పుష్కలంగా నిధులివ్వాలి

## - రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీవీ రమేష్



వైద్యరంగానికి పుష్కలంగా నిధులిచ్చి, ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీవీ రమేష్ సూచించారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో జరిగిన డాక్టర్ జెట్టి శేషారెడ్డి 13వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వైద్యరంగానికి కేవలం 1.8 శాతం మాత్రమే నిధులు కేటాయిస్తున్నారని, దానిని కనీసం 4 శాతానికి పెంచాలని, వైద్యచికిత్సలపై పూర్తిస్థాయిలో శిక్షణ, అవగాహన కలిగే విధంగా ఏర్పాట్లుచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 'జాతీయవాదం-ప్రస్తుత పోకడలు' అనే అంశంపై ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ, జాతీయత పేరుతో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లుపొడుస్తున్నారని, అదేమని ప్రశ్నించిన వారిపై దేశద్రోహులు పేరుతో అక్రమకేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయపార్టీలన్నీ కలిసి రాజ్యాంగస్ఫూర్తిని కాపాడుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సిపిఎం నాయకుడు చంద్ర రాజగోపాల్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు, ప్రజారోగ్యవేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎం.వి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయసంస్థలో..
# విజేతలకు బహుమతులు

నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 34 రోజుల పాటు జరిగిన వేసవి విజ్ఞాన తరగతులు ఈనెల 11తో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లను ఇచ్చి అభినందించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, డెప్యూటి లైబ్రేరియన్ ప్రసాద్, ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్, యోగామాస్టర్ రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, జితేంద్ర, రవీంద్రన్, గిరిజ, పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న గ్రంథాలయంలో వేసవి విజ్ఞానశిబిరం ముగింపు కార్యక్రమం సందర్భంగా ప్రజాసైన్స్ పట్టణశాఖ అధ్యక్షుడు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు బహుమతులను అందజేశారు. విజ్ఞాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను నిర్వాహకులు ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పోటీతత్వంతో రాణించాలి



మానవ వనరుల అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, బంగారు ఆంధ్రప్రదేశ్ స్థాపనే లక్ష్యంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 12న తోటపల్లి గూడూరు మండలం ఈదూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యావ్యవస్థలో పెద్దఎత్తున సంస్కరణలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని చెప్పారు. పాఠశాలల్లోని ఒకటి నుంచి పదో తరగతి వరకు పిల్లలందరికీ రూ.2000 విలువచేసే జగనన్నకిట్లను అందించడం విద్యార్థులపట్ల ముఖ్యమంత్రికి ఉన్న ప్రత్యేకశ్రద్ధకు నిదర్శనమని, జిల్లాలో 1,92,743 మంది విద్యార్థులకు 38.55కోట్లతో జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు వినియోగించుకుని, విద్యార్థులందరూ పోటీతత్వంతో విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు. ఆనం అరుణమ్మ మాట్లాడుతూ పిల్లలకు మేనమామలా ముఖ్యమంత్రి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, విద్యార్థులందరూ బాగా చదువుకుని ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఈదూరు హైస్కూల్ విద్యార్థులకు నగదు బహుమతులను జ్ఞాపికలు అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఎంపీడీవో హేమలత, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ఎం భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానానికి..
# లక్షా 8 వేల విరాళం

నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానానికి ఈనెల 12న ఇనమడుగు నరేంద్రరెడ్డి అనే దాత లక్షా 8వేల రూపాయలను విరాళంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని అష్టాదశ శక్తిపీఠాల విగ్రహమూర్తులకు రంగులు వేసేందుకు ఈ నగదును వెచ్చించాలని ఆయన కోరారు. ఆలయ ఇఓ ఏవి శ్రీనివాసులురెడ్డి, ఛైర్మెన్ రత్నం జయరామ్, సభ్యులు మల్లు రామమోహన్‌రెడ్డి, జి.దొరబాబు, ఉప ప్రధాన అర్చకుడు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# తపాలా ఏజెంట్లకు 19న ఇంటర్వ్యూలు

తపాలా జీవితబీమా, గ్రామీణ తపాలా జీవితబీమా పాలసీలను సేకరించేందుకు ఏజెంట్ల ఎంపికకు ఈనెల 19న ఇంటర్వ్యూలను నిర్వహిస్తామని, ఆసక్తి కలవారు ఆరోజు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఆచారివీధిలో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



# ముగిసిన క్రికెట్ శిక్షణా శిబిరం

అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏపిఏ సబ్ సెంటర్‌లో గత నెల 9 నుండి గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్, హరిచంద్రారెడ్డి క్రికెట్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం ఇటీవల జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ ట్రస్ట్ ఫర్ గేమ్స్ & స్పోర్ట్స్ మేనేజింగ్ ట్రస్టీ డా. సి.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణలో పాల్గొన్న ప్రతిఒక్క క్రీడాకారుడు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, చదువుతో పాటు క్రికెట్‌లోనూ ప్రతిభ మెరుగుపరచుకొని మంచి క్రీడాకారులుగా ఎదగాలని కోరారు. అనంతరం శిక్షణ తీసుకున్న క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. నెల్లూరుజిల్లా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి, జిల్లా క్రికెట్ సంఘం జాయింట్ సెక్రటరీ కొండిదల మునిగిరీష్, గూడూరు క్రికెట్ క్లబ్ సెక్రటరి తూపిలి నాగేశ్వరరావు, ఏసిఏ కోచ్ డి.లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ.ఓను సన్మానించిన ఆర్డీఓ



గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏ.ఓగా పని చేస్తూ కలువాయి తహశీల్దార్‌గా బదిలీ అయిన ఏ.ఓ స్వర్ణలతను ఆర్డీఓ కిరణ్ కుమార్ శాలువాతో సత్కరించి, ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మంచి ప్రణాళికతో, సరైన తీరులో స్వర్ణలత పనిచేశారని, మంచి సామర్థ్యం కలిగిన అధికారిణిగా ఆమె గుర్తింపు పొందారని, ముందుముందు ఆమె ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఇదే సందర్భంలో కలువాయి మండలంలో తహశీల్దారుగా విధులు నిర్వహిస్తూ.. ఇక్కడకు నూతన ఏ.ఓగా వచ్చిన విజయలక్ష్మికి ఆర్డీఓ స్వాగతం పలికారు.

## ఏపిఆర్‌జెసి ఫలితాల్లో
# శివాని విద్యార్థుల ప్రతిభ



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల ప్రవేశ పరీక్షల్లో శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. పెంచల ప్రగ్నేష్ రాష్ట్రస్థాయిలో 230వ ర్యాంకు, ఎస్.కె. ఫహీం 380వ ర్యాంకు, మేఘన 500 ర్యాంకు, ఆయిష 1973వ ర్యాంకు కేతరాం 4175 ర్యాంకుతో మొత్తం ఐదుగురు విద్యార్థులు మొదటి దశలో సీట్లు సాధించారని, మొత్తం 26మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు పొందారని స్టడీసర్కిల్ అధినేత శివకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నరసింగరావుపేటలోని విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ఫిజిక్స్ ఉపాధ్యాయులు రాధయ్య, మునిరాజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గుక్కెడు తాగునీటికీ కష్టాలే

గూడూరు పట్టణం సమీపం గాంధీనగర్ ప్రాంతంలోని టిడ్కో భవనాల సముదాయంలో కొద్దిరోజులుగా తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. టిడ్కో అపార్ట్‌మెంట్ వాసులకు పైఅంతస్తులోకి నీరు రాకపోవడంతో వారు ట్యాంకరు ద్వారా తాగునీరు, ఇతర అవసరాలు తీర్చుకొంటున్నారు. ఇక్కడ సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పట్టణంలో సరఫరా ఏర్పాటు చేసినా పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో నిత్యం తాగునీటికి తిప్పలు తప్పడం లేదు.



## మల్లాం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి
# వెండి హారతి పళ్లెం వితరణ

చిట్టమూరు మండలం మల్లాంలోని వల్లీ దేవసేన సమేత స్వయంభు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి 50వేల రూపాయల విలువైన వెండిహారతి పళ్లాన్ని దాతలు అందజేశారు. ఈ నెల 11న గూడూరు పట్టణానికి చెందిన సేగు లక్ష్మీనారాయణ బాబు రూ.50వేల విలువైన 880 గ్రాముల వెండి హారతి పళ్లాన్ని ఆలయ కమిటీ ఛైర్మెన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డికి అందజేశారు. కుటుంబసమేతంగా విచ్చేసిన దాత లక్ష్మీనారాయణ బాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు ఆయనకు స్వామి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్య క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పార్థసారథిరెడ్డి, స్వామి సేవకులు భాస్కర్‌రెడ్డి, సిబ్బంది సుబ్బరామయ్య, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'యువగళం'లో గూడూరు నేతలు

యువగళం పాదయాత్ర నెల్లూరుజిల్లాలో ప్రవేశించడంతో నారా లోకేష్‌కు స్వాగతం పలికేందుకు గూడూరు నియోజకవర్గం నుంచి భారీస్థాయిలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గంగా ప్రసాద్‌ను కలిసి అక్కడనుంచి వాహనాల్లో వెళ్లారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సర్వోత్తమరెడ్డి, మధుసూదనరెడ్డి, వెంకటేశ్వర్లరెడ్డి, కిరణ్‌కుమార్, చెంచు రామయ్య, మస్తాన్‌నాయుడు, శ్రావణి, వెంకటేశ్వర్లురాజు తదితరులు ఉన్నారు.

# 'గడప గడపకు' కార్యక్రమానికి అపూర్వ స్పందన

## - నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రతిచోటా అపూర్వ స్పందన కనిపిస్తోందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 14న నెల్లూరులోని 18వ డివిజన్‌లో కార్పొరేటర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ముఖ్యంగా మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై మంచి స్పందన లభిస్తోందన్నారు. రానున్న రెండు మూడు నెలల్లో మిగతా ప్రాంతాలలో కూడా పర్యటించి గడప గడపకు కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 18వ డివిజన్లో మురుగు కాలువను పరిశీలించి పరిశుభ్రం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు పాశం శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, స్వర్ణ వెంకయ్య, సునీల్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, హరిబాబు యాదవ్, నూనె మల్లికార్జునయాదవ్, కోడూరు కమలాకర్‌రెడ్డి, దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వంశీ, మేఘనాథ్‌సింగ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, 17వ డివిజన్‌లోని శ్రామిక నగర్‌లో ఎంపీ ఆదాల రోడ్డుకు శంకుస్థాపన చేశారు. 10లక్షల రూపాయలతో ఆ రోడ్డును నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక కార్పొరేటర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అజీజ్‌ను పరామర్శించిన ఆదాల



నెల్లూరు ఎంపీ, వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాజీ మేయర్, టిడిపి జిల్లా నేత అబ్దుల్ అజీజ్‌ను ఆయన స్వగృహంలో పరామర్శించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఆదాల 18వ డివిజన్‌కు బుధవారం సాయంత్రం విచ్చేసినప్పుడు అదే వీధిలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకుడు అబ్దుల్ అజీజ్ ఇంటికి వెళ్లారు. ఆత్మీయంగా ఆయన్ను పలకరించారు. అస్వస్తతతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న అబ్దుల్ అజీజ్ అనారోగ్య కారణాలను తెలుసుకున్నారు. అజీజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తనను పరామర్శించేందుకు స్వయంగా ఆదాల రావడంతో ఆశ్చర్యపోయిన అబ్దుల్ అజీజ్ ఆ తర్వాత ఆయన పరామర్శకు ఎంతో సంతోషించి ఆదాలకు ధన్యవాదాలు తెలిపారు. వైసిపి, టిడిపికి చెందిన ఇద్దరు నేతలు ఇలా కలుసుకొని తమ అభిమానాన్ని పంచుకోవడం ద్వారా తమ రాజకీయ విలక్షణతను చాటుకున్నారు. నెల్లూరు రాజకీయాలు కేవలం ప్రజల కోసం, సామాజిక న్యాయం కోసమేనని, విభేదాలు కక్షలు కార్పణ్యాల కోసం కాదని గతంలో ఎన్నోసార్లు నెల్లూరు నేతలు నిరూపించారు. అదే సంప్రదాయాన్ని ఎంపీ ఆదాల కూడా పాటించడం ప్రజలను బాగా ఆకట్టుకుంది. నేతల ఆదర్శం అందరిలో ఆశ్చర్యంతో పాటు ఆనందం నింపింది.

# నీట్‌లో 'నారాయణ మెడికల్ అకాడమీ' విద్యార్థుల ప్రతిభ



ఇటీవల ప్రకటించిన నీట్-2023 ఫలితాల్లో నెల్లూరు నారాయణ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. జాతీయస్థాయిలో సత్తాచాటుతూ ఉత్తమ ఫలితాలు సాధించి విద్యారంగంలో నారాయణ కీర్తిబావుటాను రెపరెపలాడించారు. జాతీయస్థాయిలో 690, 685, 685, 681, 661, 660, 652 వంటి అత్యుత్తమ మార్కులతో పాటు, వివిధ కేటగిరీల్లో 24, 153, 291, 528, 796, 882 వంటి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించి నారాయణ అగ్రస్థానంలో నిలిచిందని నారాయణ మెడికల్ అకాడమీ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. మెడికల్ విభాగంలో జాతీయస్థాయి ఓపెన్ కేటగిరిలో నారాయణ మెడికల్ అకాడమి విద్యార్థులు ఎస్.వెంకటలక్ష్మీసాహితి 690 మార్కులతో 796వ ర్యాంకును, 685 మార్కులతో ఎం.భానుశంకర్ 1060వ ర్యాంకును, 685 మార్కులతో ఏ.రామ్‌కుమార్ 1146వ ర్యాంకును, 681 మార్కులతో ఐ.అక్షయరెడ్డి 1403వ ర్యాంకును, 661 మార్కులతో టి.దోని అభినవ్ 4314వ ర్యాంకును, 660 మార్కులతో డి.రిషికారెడ్డి 4798వ ర్యాంకును, 652 మార్కులతో బి.సాత్విక్ 6304వ ర్యాంకును సాధించారని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో వివిధ క్యాటగిరీల్లోనూ నారాయణ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని, ఎం.భానుశంకర్ 24వ ర్యాంకును సాధించగా, బి.సాత్విక్ 153వ ర్యాంకు, ఏ.రామ్‌కుమార్ 291వ ర్యాంకు, ఎస్.వెంకటలక్ష్మీసాహితి 528వ ర్యాంకు, ఐ.అక్షయరెడ్డి 882వ ర్యాంకు సాధించారని ఆయన పేర్కొన్నారు. దాదాపు 280 మెడికల్ సీట్లు నారాయణ విద్యార్థులు సాధిస్తారని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఈఏపీ సెట్‌లో విజయశంఖారావం

ఏపీ ఈఏపీ సెట్ -2023 ఫలితాల్లో నెల్లూరులోని నారాయణ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 3,4,8,9 ర్యాంకులను కైవసం చేసుకుని ప్రతిభను నిరూపించుకున్నారు. నెల్లూరు నారాయణ ఐఐటి అకాడమీ విద్యార్థులు జి.ప్రణీత్‌సాయి 42వ ర్యాంకు, ఆర్ మేఘన 232వ ర్యాంకు, పి.లోహిత్ ఆదిత్య 304వ ర్యాంకు, ఆర్.ప్రణవ్‌సాయి 386వ ర్యాంకు, కె.అర్జున్ 415వ ర్యాంకు సాధించారని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. 100 లోపు ఒకరు, 500 లోపు 5గురు, 1000 లోపు 19 మంది, 2000 లోపు 46 మంది, 3000 లోపు 71 మంది, 5000 లోపు 126 మంది, 10,000 లోపు 235 మంది, 20,000 లోపు 458 మంది, 30000 లోపు ర్యాంకులు 735 మంది సాధించారని ఆయన పేర్కొన్నారు. మెడికల్ విభాగంలో నారాయణ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 28, 34, 56 ర్యాంకులను సాధించడం విశేషమన్నారు. నెల్లూరు నారాయణ మెడికల్ అకాడమీ విద్యార్థులు ఎం.భానుశంకర్ 102వ ర్యాంకు, ఎస్.వెంకటలక్ష్మీసాహితి 116వ ర్యాంకు, టి.థోని అభినవ్ 147వ ర్యాంకు, ఎం.రామ్‌కుమార్ 183వ ర్యాంకు సాధించారని, 200 లోపు ర్యాంకులు నలుగురు, 500 లోపు 16 మంది, 1000 లోపు 32 మంది, 2000 లోపు 48 మంది, 5000 లోపు 112 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇంతటి ఘనవిజయాలను సాధించిన విద్యార్థులను, వారి తల్లితండ్రులను, అధ్యాపకవర్గాన్ని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం అభినందించిందని ఆయన తెలిపారు.



# జమ్ములో శ్రీవారి ఆలయ సంప్రోక్షణలో.. వేమిరెడ్డి దంపతులు

ఇటీవల ఉత్తరభారతదేశంలోని జమ్ములో తిరుమల తిరుపతి దేవస్థానాల వారిచే నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ఆలయం మహా సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జమ్ముకశ్మీర్ గవర్నర్ మనోజ్‌సిన్హా, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, రంజిత్‌సింగ్, టీటీడీ బోర్డు ఛైర్మెన్ డాక్టర్ వైవీ సుబ్బారెడ్డి దంపతులతో కలసి పాల్గొన్న రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..టిటిడి ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి (న్యూఢిల్లీ) అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి.

# 'ఆరోగ్య భారత్' సాకారం కావాలి



పేదరికం, వివక్షలకు తావులేని 'ఆరోగ్య భారత్' సాకారం కావాలని భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ఆకాంక్షించారు. ఈనెల 14న ఆయన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కిమ్స్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల భారతదేశం జనాభాలో అగ్రస్థానానికి చేరటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాల్లో ప్రజల్లో అవగాహన, స్వీయ నియంత్రణ అవసరమని సూచించారు. జనాభా పెరుగుదల నేపథ్యంలో సుఖంగా, ఆరోగ్యకరంగా, సంతోషకరంగా ప్రజలు జీవించే విధంగా భారతదేశంలో సౌకర్యాల కల్పన అత్యంత ఆవశ్యకమన్నారు. ప్రభుత్వాలతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు కూడా ఈ విషయాల పట్ల దృష్టి కేంద్రీకరించాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సౌకర్యాల కల్పన సవాలుతో కూడుకున్న విషయమన్నారు. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలను తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలతో పాటు ప్రైవేట్ వైద్య సంస్థలు, సేవా సంస్థలు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న జీవనశైలి కారణంగా అసంక్రమిత వ్యాధులు పెరుగుతున్నాయని, ఈ విషయంలో ప్రజలంతా ప్రత్యేకించి యువత అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు. నిత్యం వ్యాయామం, యోగ వంటివాటికి సమయాన్ని కేటాయించటం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం, పచనం చేసిన సంప్రదాయబద్ధమైన ఆహారాన్ని తీసుకోవటం వంటి జాగ్రత్తలతో జీవనశైలిలో మార్పులు అవసరమని సూచించారు.

స్వర్ణభారత్ ట్రస్ట్ స్థాపించిన నాటి నుంచి నిపుణులైన వైద్యుల సహకారంతో, నాణ్యమైన వైద్యాన్ని గ్రామీణ పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. నేడు ప్రారంభించిన ఉచిత వైద్య శిబిరంలో కాన్సర్, గుండె వ్యాధులు, నరాల వ్యాధులు, కీళ్ళు-ఎముకలు, చెవి-ముక్కు-గొంతుకు సంబంధించిన నిపుణులైన వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందజేస్తారని, ఉచితంగా మందులతో పాటు, భోజన సౌకర్యాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులు ఏర్పాటు చేశారని, ఈ సదుపాయాలను గ్రామీణప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# విఎస్‌యు జాబ్ మేళాలో 80 మందికి ఉద్యోగాలు




నెల్లూరు సమీపంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఈనెల 15న బాలాజీ ప్లేస్‌మెంట్స్ వారి సహకారంతో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రముఖ కంపెనీలైన టెక్ మహేంద్ర, హెచ్‌సిఎల్, జొమాటో, ఫస్ట్ సోర్స్ కంపెనీ, క్లస్టర్ ఐటీ సొల్యూషన్ సాఫ్ట్‌వేర్ మరియు ఐసిఐసిఐ బ్యాంక్ వారు పాల్గొన్నారు. దాదాపుగా 150 మందికి పైగా విద్యార్థులు ఈ మేళాకు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి 80 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను పొందినట్టు విఎస్‌యు ప్లేస్‌మెంట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సాయి స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు.



# విద్యుత్ బస్సులు వచ్చేశాయ్

- నెల్లూరు-తిరుపతికి ఇక ఇబ్బందే లేదు
- ఏసీ సౌకర్యం కూడా ఉంది

ఎప్పటినుంచో వస్తాయనుకుంటున్న విద్యుత్ బస్సులు రానే వచ్చాయి. నెల్లూరు నుంచి తిరుపతికి ఆరు బస్సులు, తిరుపతి నుంచి నెల్లూరుకు మరో ఆరు బస్సులు కేటాయించారు. దీంతో నెల్లూరు-తిరుపతిల మధ్య బస్సు సర్వీసులు పెరగడంతో ప్రయాణీకులకు మరింత సౌలభ్యం చేకూరినట్లయింది. ఇటీవల నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ప్రాంగణంలోని రెండవ రెండవ డిపో గ్యారేజ్‌లో ఆర్టీసీ ఛైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి ఆ బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వం విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటోందని, రాష్ట్రవ్యాప్తంగా కాలంచెల్లిన బస్సుల స్థానంలో విద్యుత్ బస్సుల కొనుగోలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతులిచ్చారని ఆయన పేర్కొన్నారు. కాలుష్యం లేకుండా, పర్యావరణ హితమే లక్ష్యంగా విద్యుత్ బస్సులను ఆర్టీసీ ప్రవేశపెడుతోందని, త్వరలో మరిన్ని పట్టణాలకు విద్యుత్‌బస్సులను అందుబాటులోకి తెస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటికే ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సంస్థకు చెందిన 50 బస్సులను తిరుపతి-తిరుమల మధ్య ప్రవేశపెట్టామన్నారు. ఒక్కసారి విద్యుత్‌చార్జింగ్ చేస్తే బస్సు 200 కిలోమీటర్ల దాకా ప్రయాణిస్తుందని, ఒక్కో బస్సులో డ్రైవర్‌తో పాటు 35 మంది ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రయాణీకుల్లో ఈ బస్సుల పట్ల ఆదరణ బాగా ఉందని, బస్సులు నిర్ణీత వేళల్లో తిరుపతి నుంచి, నెల్లూరు నుంచి ప్రయాణాలు సాగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ బత్తుల సుప్రజ, రీజనల్ ఛైర్మన్ వెంకటశేషయ్య, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ అధికారులు పాల్గొన్నారు.

# నేత్రపర్వం..శ్రీ చెంగాళమ్మ అమ్మవారి తెప్పోత్సవం



తెలుగు-తమిళ ప్రజల ఆరాధ్య దేవత సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఈనెల 12న సోమవారం రాత్రి అమ్మవారికి వైభవంగా తెప్పోత్సవం జరిగింది. కాళంగినదిలో కనువిందుగా జరిగిన ఈ తెప్పోత్సవంలో అమ్మవారు ముత్యాలచీర అలంకారంతో శోభాయమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. నదిలో తెప్పలపై అమ్మవారి ఊరేగింపును చూసి భక్తులు పరవశించిపోయారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఇన్‌చార్జి ఇఓ శ్రీనివాసులురెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెప్పోత్సవం సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా వేడుకలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి.

# అధిక ఫీజులు గుంజుతున్న..కార్పొరేట్ విద్యాసంస్థలు

**- విద్యార్థి జేఏసీ నాయకులు**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధికమొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని, అలాంటి విద్యాసంస్థలను పరిశీలించి వెంటనే వాటి గుర్తింపును రద్దుచేయాలని కోరుతూ ఇటీవల ఏపీ విద్యార్థి జేఏసీ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవానికి వినతిపత్రం అందజేశారు. జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యాసంస్థలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి, నిబంధనలను పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మనోజ్, పార్థసారథి, సందీప్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిని కోల్పోయిన పిల్లలను

# ఆదుకున్న..కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



తల్లిని కోల్పోయిన పిల్లలు, అందులోనూ మానసిక వికలాంగులైన ఆ పిల్లల దయనీయ స్థితిని చూసి స్పందించిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న మానవతాదృక్పథంతో వారిని ఆదుకున్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇటీవల విడవలూరు మండలం, ముదివర్తి పంచాయతీలో పర్యటిస్తుండగా గాంధీనగర్‌లో తల్లిని కోల్పోయిన పిల్లలు మరియు మానసిక వికలాంగులైన పిల్లలను చూసి, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి భవిష్యత్తుకు బాట వేయాలని ఆలోచనతో గాంధీనగర్‌లో మానసిక వికలాంగురాలు పొన్నూరు పుష్పకు రూ.25 వేలు, కండ్రిగలో మానసిక వికలాంగుడు చిలకపాటి నాసిర్‌కు రూ.25 వేలు, ముదివర్తి గ్రామానికి చెందిన అరిపాటి చాముండేశ్వరికి రూ.20 వేలు, అరిపాటి రాజేశ్వరికి రూ.20 వేలు మొత్తం రూ.90 వేల రూపాయలను ఆర్థికసాయంగా ప్రకటించారు. తన తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ పిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేంతవరకు బ్యాంకులో ఆ నగదును ఫిక్స్ డిపాజిట్ చేయించి ఆ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

# యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలి

**- గొలగమూడిలో కలెక్టర్**

ప్రస్తుత పరిస్థితుల్లో డిమాండ్ ఉన్న వృత్తి నైపుణ్య కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారులను ఆదేశించారు. ఇటీవల వెంకటాచలం మండలం, గొలగమూడిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ (ఐఐటిటిఎం) కళాశాలను ఆయన సందర్శించి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య కోర్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి పరిస్థితులకు అనుగుణంగా యువతకు ఉపయోగపడే వృత్తి విద్యాకోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీయువకులకు వివిధ రకాల సాంకేతిక నైపుణ్యాలను నేర్పించి పెద్ద కంపెనీలలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పనిచేయాలని సంబంధిత అధికారికి సూచించారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి విజయ్ వినీల్‌కుమార్, కళాశాల ప్రాజెక్టు ఇన్‌చార్జి పి. శరవణన్, వెంకటాచలం తహశీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో...




తొలుత, జిల్లా కలెక్టర్ యం. హరినారా యణన్ గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమ విద్యాలయాన్ని, ఆశ్రమ వైద్యశాలను, ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్‌ను, ఆశ్రమ కల్యాణ మండపం, యాత్రికుల వసతి సముదాయాన్ని, నిత్యాన్న దానశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో పేదలకు అమలు చేస్తున్న విద్య, వైద్య సేవలను, భక్తులకు అందచేస్తున్న సదుపాయాలను ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.బాలసుబ్రహ్మణ్యం జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట వెంకటాచలం తహశీల్దార్ కృష్ణ పాల్గొన్నారు

# విఎస్‌యులో అవగాహన సదస్సు



ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష మేరకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశమంతటా జూన్ ఒకటి నుండి 15వ తారీకు వరకు వివిధ అంశాల మీద విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణం సివి రామన్ సెమినార్ హాల్‌లో నైపుణ్యాభివృద్ధి, స్కిల్ హబ్ మరియు స్కిల్ కాలేజ్ ప్రాముఖ్యత గురించి నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి విజయ వినీల్ కుమార్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుంటేనే మంచి ఉద్యోగాలు పొందే అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ నైపుణ్యాభివృద్ధి సమన్వయకర్త డా. జె.విజేత తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు.. 19న

నెల్లూరు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జూన్ 19న స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతాయని జడ్పీ సిఇఓ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, సాంఘిక సంక్షేమం తదితర అంశాలపై చర్చలుంటాయని, సభ్యులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

### చిత్తలూరులో క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహారం

చేజర్ల మండలంలోని చిత్తలూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల 12న క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం కిట్‌లను పంపిణీ చేశారు. వ్యాధిగ్రస్తులు పోషకాహారం తీసుకుంటూ, మందులు సకాలంలో వాడితే ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ నవీన్, డాక్టర్ జ్యోతి, క్షయవ్యాధి సూపర్‌వైజర్ శ్రీనివాసులురెడ్డి వ్యాధిగ్రస్తులకు తెలిపారు.

### కలువాయిలో శ్రీ నారసింహ సుదర్శన హోమం

మండలకేంద్రమైన కలువాయిలో కొలువైవున్న శ్రీ లక్ష్మీ నారసింహస్వామి దేవాలయంలో ఈనెల 12న విశిష్టమైన శ్రీ లక్ష్మీ నారసింహ సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ యాగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకులు నరసయ్యస్వామి ఆధ్వర్యంలో, అర్చకులు సోమశేఖరస్వామి తదితరుల నేతృత్వంలో ఈ హోమం జరిగింది.

### వడ్లపూడిలో రక్తదాన శిబిరం

మనుబోలు మండలం వడ్లపూడి గ్రామంలో ఈనెల 13న రెడ్‌క్రాస్ రక్తనిధి జిల్లా కన్వీనర్ అజయ్‌బాబు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు, యువత రక్తదానం చేశారు. అనంతరం, గ్రామదేవత పొన్నూరమ్మ అమ్మవారి దేవాలయంలో వంటశాలను ప్రారంభించారు. రక్తనిధి జిల్లా మోటివేటర్ మధుసూదన్ పాల్గొన్నారు.

### కలువాయిలో విద్యాకానుక కిట్‌లు పంపిణీ

కలువాయి మండలంలోని తెలుగురాయపురం ఎస్సీకాలనీ పాఠశాలలో ఈనెల 13న సర్పంచ్ రమణమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ చేశారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ చెంచురత్నం, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉలవపాడులో బస్తా సపోటాలు రూ.1100

సపోటా ధరలు పెరిగాయి. దీంతో సపోటాలు బాగా సాగయ్యే ఉలవపాడులో ఫారిన్ రకం సపోటాల ధర బస్తా 1100 రూపాయలు పలుకుతోంది. గిట్టుబాటు ధరలు రావడంతో రైతులు సంతోషిస్తు న్నారు. సాధారణ రకం సపోటాల ధర బస్తా 500 రూపాయలు చెప్తున్నారు.

### వేసవి సెలవులు మరో వారం పొడిగించండి

పాఠశాలలకు వేసవి సెలవులు మరో వారం రోజులు పొడిగించాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సెలవుల్లో ఒక్కపూట మాత్రమే బడులు నిర్వహిస్తున్నా, ఉదయం నుంచే ఎండలు మండిపోతుండడంతో పాఠశాలలకు విద్యార్థులు రావడం ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు.

### రైతుల భూములకు పరిహారం ఇవ్వండి

సీతారామపురం పబ్బులేటిపల్లిలో జాతీయ రహదారికి సంబంధించి భూసేకరణలో భూమిని కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం సకాలంలో అందించి న్యాయం చేయాలని కోరుతూ మాజీ జడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు ఈనెల 13న విజ్ఞాపనపత్రం సమర్పించారు.

### రక్తదాతలకు 'లయన్స్‌క్లబ్' సత్కారం

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 12న నెల్లూరులో పలువురు రక్తదాతలను లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని ఆధ్వర్యంలో సత్కరించారు. స్థానిక గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్రపార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రక్తదాతలు సతీష్‌కుమార్, లీలాధర్‌రెడ్డి, సునీల్‌బాబు, హర్షవర్ధన్, హేమంత్‌లు ఈ సత్కారాలందుకున్నారు.

# రైతుల పాలిట శాపంగా.. వైకాపా పాలన


## ధ్వజమెత్తిన టిడిపి యువనేత లోకేశ్



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతకాని పాలన రైతుల పాలిట శాపంగా మారిందని టిడిపి యువనేత, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌బాబు ధ్వజమెత్తారు. గత నాలుగేళ్ళుగా రైతులు నష్టాలకు కష్టాలకు గురవుతూ చివరికి ఆత్మహత్యల దారిని ఎంచుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దసంఖ్యలో ఆయా ప్రాంతాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీఎత్తున జరుగుతున్న 'యువగళం' పాదయాత్రలో భాగంగా ఈనెల 14న లోకేశ్‌బాబు జిల్లాలోని మర్రిపాడు మండలం పడమటినాయుడు పల్లిలో మెట్టప్రాంత రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీవిత్తనాలకు చిరునామాగా వైకాపా ప్రభుత్వం పేరు తెచ్చుకుందని ఎద్దేవా చేశారు. దళారీ వ్యవస్థకు చరమగీతం పాడుతామంటూనే ఆ వ్యవస్థను ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడం దారుణమన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్తులకు, ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. దళితుల భూములను లాగేసుకుంటున్నారని, అదేమని ప్రశ్నించేవారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని, వైకాపా భూబకాసురులు కొండలను, గుట్టలను, వాగులు వంకలను దేనినీ వదిలిపెట్టకుండా ఆక్రమించేసుకుంటున్నారని ఆయన అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైకాపా నేతలు లాక్కున్న భూములను తిరిగి దళితులకు అప్పగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వైకాపా వచ్చాక రాష్ట్రంలో అరాచకత్వం పెరిగిపోయిందన్నారు. వైకాపా వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులేమీ కట్టలేకపోగా, చివరికి పిల్లకాలువలను కూడా తవ్వించలేకపోతున్నారని, తాము అధికారంలోకి వస్తే ఈ కష్టాలన్నీ తీరుస్తామని, దళారీవ్యవస్థకు చరమగీతం పాడుతామని, ప్రజలకు సుపరిపాలన అందిస్తామని భరోసా ఇచ్చారు.

మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న మెట్టప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి తెలుసుకోవాలనే ఉద్దేశంతో లోకేశ్‌బాబుతో ఈ సమావేశం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య, ఆనం రంగమయూర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చెంచలబాబు యాదవ్, వెంకటేశ్వర్లుచౌదరి, జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు రాపూరు సుందరరామిరెడ్డి, రామనారాయణరెడ్డి కుమార్తె కొండ్రెడ్డి లీలా కైవల్యరెడ్డి, అల్లుడు రితీష్‌రెడ్డి, ఆత్మకూరు టిడిపి నాయకులు పుట్టం బ్రహ్మానందరెడ్డి, ఆరికట్ల జనార్దన్‌నాయుడు, పాలెం పోలయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరీయులకు సుపరిచితులైన కొండూరు హరినారాయణరెడ్డి మనుమడు, కోడూరు శ్రీహరిరెడ్డి - సురేఖల కుమారుడు **సాయి శ్రీకాంత్‌రెడ్డి - భావన సంధ్య** (నాయుడుపేట వాస్తవ్యులు తంబిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి - జ్యోతిల కుమార్తె)ల వివాహం జూన్ 9వ తేదీ నాయుడుపేటలోని కె.ఎమ్.ఆర్. కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.

# ఉద్యోగుల కష్టం.. ఎవరికి నష్టం?

(మొదటి పేజీ తరువాయి)

### ఒక్కమాటా నిలబెట్టుకోలేదు..!

ఒక డిఏ బకాయిని మూడు విడతల్లో ఇవ్వాల్సి ఉంటూ జీవో ఇచ్చిన ఘన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదే. ఆ జీవో వచ్చి 4ఏళ్లు దాటినా ఇంకా చెల్లింపులు మాత్రం జరగలేదు. సాధారణంగా కరువు భత్యంగా ప్రభుత్వం ప్రతి 6 నెలలకొకసారి డిఏ ఇస్తుంది. కరువు ఇప్పుడైతే భత్యం ఇంకెప్పుడో ఇస్తాననడం ఉద్యోగులకు మింగుడుపడడం లేదు. కొత్త పీఆర్సీ వేయాల్సిన సమయం వచ్చింది కానీ, ప్రభుత్వం ఇంకా పాత పీఆర్సీ బకాయిల లెక్కలే తేల్చలేదు. ఈ లెక్క తేల్చని బకాయిలను 2024 నుంచి 2027 వరకు 16 విడతల్లో ఉద్యోగులకు చెల్లిస్తారని అంటోంది ప్రభుత్వం. కేంద్రం ప్రకటించిన రెండు డిఏలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. 27శాతం ఐఆర్ ఇచ్చి ఇంతకంటే తక్కువగా 23శాతం పీఆర్సీ ప్రకటించి, మిగిలిన 4 శాతాన్ని ఉద్యోగుల నుంచి రికవరీ చేయడం ఉద్యోగులను మరింత రగిలించింది. ఉద్యోగులకు పూర్తిస్థాయిలో వేతనాలు, పెన్షన్లు అందేసరికి ప్రతినెలా 20వ తేదీ దాటుతోంది. దీనిపై ఏపీ ప్రభుత్వ సంఘం గవర్నర్‌కి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదును తోసిపుచ్చి ఉద్యోగ సంఘాలపై చర్యలకు పూనుకోవడంతో ఉద్యోగులకు, ప్రభుత్వానికి మరింత దూరం పెరిగిందంటున్నారు విశ్లేషకులు.

### వారంలో రద్దు అన్నారు... ఇప్పటికి 210 వారాలయ్యింది..!

అధికారంలోకి వచ్చిన వారంలోగా సీపీఎస్‌ను సీఎం జగన్ రద్దు చేస్తాననడంతో 2019లో వార్ వన్‌సైడ్ అయిపోయింది. జగన్ అధికారంలోకి వచ్చి ఇప్పటికి 210 వారాలైంది. వైసీపీ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేయబోమంటూ కేంద్రానికి రాసిచ్చి అదనంగా కేంద్రం నుంచి రూ.4,200 కోట్ల కొత్త అప్పులకు అనుమతి తెచ్చుకుంది. దీనిపై ఉద్యోగులు రగిలిపోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను తీసుకొచ్చింది. ఇందులో ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ ఖచ్చితంగా ఇస్తామని చెప్తోంది. సీపీఎస్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఫండ్ ఏర్పాటు చేసి అందులో నుంచి చెల్లిస్తారా? బడ్జెట్ ప్రత్యేక కేటాయింపులు చేయడం ద్వారా చెల్లిస్తారా? స్పష్టతనివ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాగే, ఓపీఎస్ ఉద్యోగులకు ఐదేళ్లకొకసారి పీఆర్సీతో పెన్షన్ రివైజ్ అవుతుంది. దీనిపై డీఆర్ వస్తుంది. హెల్త్‌కార్డులుంటాయి. ఇవన్నీ కూడా సీపీఎస్ ఉద్యోగులకు ఇస్తారా లేదా...? తేల్చండి అంటూ ఉద్యోగులు మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం మౌనంగానే ఉంటోంది. మరోవైపు రాజస్థాన్, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో సీపీఎస్ రద్దు చేశారు.

### ఉద్యోగుల సమస్యలు

**డీఏల బకాయిలు (2018 జూలై నుంచి 2019 జనవరి):** ఇవి టీడీపీ హయాంలో ప్రకటించిన డీఏలు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఏడాది ఈ డీఏల చెల్లింపు బిల్లులు అత్యవసర బిల్లులుండే గ్రీన్ చానల్‌లో పెడుతున్నారు. ఆర్థిక సంవత్సరం చివరిరోజు మార్చి 31వ తేదీ వచ్చేసరికి వాటిని చెల్లించకుండా రద్దు చేస్తున్నారు. మూడేళ్లు ఇలాగే చేశారు. 2023 మార్చి 31న ఈ బిల్లులను ప్రభుత్వం రద్దు చేయలేదు. అలా అని చెల్లించనూ లేదు. ఈ బకాయిలు ఉద్యోగుల ఖాతాల్లోకి ఇంతవరకు జమ కాలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా టెక్నికల్ సమస్య పేరుతో ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల నుంచి వెనక్కి తీసుకున్న నగదును ఇంతవరకు తిరిగి జమ చేయలేదు. దీనిపై డిసెంబరు 2022 నాటికి తిరిగి ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేస్తామని హైకోర్టుకి చెప్పారు. ఉద్యోగి కేడర్‌ను బట్టి ఒక్కో ఉద్యోగికి రూ.50,000 నుంచి రూ.1,50,000 వరకు వస్తాయి.

**వైసీపీ హయాంలో డీఏల బకాయిలు (2019 జూలై నుంచి 2021 జూలై) :** పెరుగుతున్న ధరల తాకిడిని తట్టుకోవడానికి విడుదల చేయాల్సిన డీఏలను ఇప్పటివరకూ నిలిపే ఉంచింది వైసీపీ ప్రభుత్వం. ఈ 54 నెలల డీఏలను ఇంతవరకు ఒక్క ఉద్యోగికీ చెల్లించలేదు. ఉద్యోగుల కేడర్‌ను బట్టి ఈ బకాయిలు ఒక్కొక్కరికి రూ. 50,000 నుంచి రూ.2,50,000 వరకు వస్తాయి. పైగా ఈ 5 డీఏలను పీఆర్సీలో కలిపేసిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ 5 డీఏల బకాయిల మొత్తాన్ని పీఆర్సీ బకాయిల నుంచి వేరు చేయలేదు. భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలు దీనిని ఒక అలవాటుగా మార్చుకుంటే ఉద్యోగులకు మరింత నష్టం జరిగే ప్రమాదం కూడా లేకపోలేదు.

**2 డీఏల పెండింగ్ (2022 జూలై నుంచి 2023 జనవరి) :** గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు 'గౌరవ ముఖ్యమంత్రి 'సమయానికి డీఏలు ఇవ్వాలి' అని టీడీపీ ప్రభుత్వానికి హితవు చెప్పారు. కానీ, ఆచరణలో మాత్రం వైసీపీ వాటిని పాటించడం లేదు. 11వ పీఆర్సీలోని 2022 జూలై 3.64 శాతం, 2023 జనవరి 3.64 శాతం ఈ రెండు డీఏల విడుదల కోసం ఉద్యోగులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని ఒక విశ్రాంత ఉద్యోగి చెప్పడం గమనార్హం.

**11వ పీఆర్సీ బకాయిలు :** ఈ పీఆర్సీ అమలులోకి వచ్చి ఏడాదిన్నర దాటింది. ఒక్కో ఉద్యోగికి రావాల్సిన పీఆర్సీ బకాయిల లెక్కలు ప్రభుత్వం ఇంకా తేల్చలేదు. గతంలో 10వ పీఆర్సీ బకాయిలను గత ప్రభుత్వం ఆ ప్రభుత్వం పీరియడ్‌లోనే జమ చేసింది. ప్రస్తుత 11వ పీఆర్సీ బకాయిలు ఎప్పుడిస్తారో తెలీని గందరగోళం నెలకొంది.

**లోన్లు, అడ్వాన్సులు :** ప్రతి పీఆర్సీలోనూ లోన్లు, అడ్వాన్సులను ఎంతోకొంత పెంచడం ఆనవాయితీ. కానీ, ప్రస్తుత 11వ పీఆర్సీలో, ఈ అంశం మీద ఎలాంటి నిర్ణయం జరగలేదు. ఏడాదిపైగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై జీవోల విడుదల గురించి ఇంకా ఎదురుచూపులే.

**అమ్మో 1వ తేదీ :** 2019కి ముందు ఏ ఉద్యోగైనా ఒకటో తేదీనే జీతం అందుకున్నారు. ఎస్ఎల్, ఈఎల్, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ లోన్లు, అడ్వాన్సుల గురించి ఆలోచించేవారు కాదు. దరఖాస్తు చేసుకున్న మరుసటిరోజు నుంచి గరిష్టంగా వారంలోగా ఆ డబ్బు చేతిలో ఉండేది. కానీ, ఇప్పుడు మూడేళ్ల క్రితం జీపీఎఫ్ కోసం పెట్టుకున్న దరఖాస్తులు కూడా ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి. లోన్లు, అడ్వాన్సులు అసలు ఇవ్వడం లేదు.

**హెల్త్‌కార్డులు :** ఉపయోగపడే హెల్త్‌కార్డుల కోసం ఉద్యోగులు 2014 నుంచి పోరాటం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న హెల్త్‌కార్డులు ఆసుపత్రుల్లో పనిచేయడం లేదని, పెరిగిన వైద్యం ఖర్చుల ముందు ఈ హెల్త్‌కార్డులను ఆసుపత్రులు పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ప్రభుత్వాలతో మొరపెట్టుకుంటూనే ఉన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రెండూ ఈ విషయంలో ఉద్యోగులకు మొండిచేయే చూపించాయి.

"సామాన్య ప్రజలని యామార్చినట్లు ఉద్యోగస్తులను మాయ చేయడం అంత సులభం కాదు. మాతో పెట్టుకుంటే ఏమవుతుందో గతంలో అనేక ప్రభుత్వాలు రుచి చూశాయి, మమ్మల్ని తక్కువగా అంచనా వేస్తే అది ప్రభుత్వ మూర్ఖత్వమే అవుతుంది" అంటూ ఒక సీనియర్ ప్రభుత్వోద్యోగి కామెంట్ చేయడం చూస్తుంటే, ప్రజలని ఏ స్థాయిలో వాళ్ళు ప్రభావితం చేయగలరో అర్థమవుతోంది.

ఏది ఏమైనా ప్రభుత్వ ఉద్యోగులకు కష్టం కలిగితే నష్టం ప్రభుత్వానికే అన్నది మాత్రం స్పష్టమవుతోందని విశ్లేషకుల అభిప్రాయం.

# ఏపీలో బీజేపీ కామెడీ..



కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా మొన్న శని, ఆదివారాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. వారి కోసం, రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతలు చెరో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. జే.పీ.నడ్డా శ్రీకాళహస్తిలోనూ, అమిత్ షా విశాఖపట్నం సభలోనూ మాట్లాడారు.

ముందు శ్రీకాళహస్తి వెళదాం. శివుడికి ఓ దణ్ణం పెట్టుకున్నట్టూ ఉంటుంది... జే.పీ.నడ్డా ఉపన్యాసం గురించి తెలుసుకున్నట్టూ ఉంటుంది.

ఏపీలో ఉన్నది అవినీతి ప్రభుత్వమని, స్కాములు తప్ప జనానికి స్కీములు ఏమీ లేవని... జే.పీ.నడ్డా జగన్ సారథ్య ప్రభుత్వ పనితీరును తీవ్రంగా విమర్శించారు.

'లా' లేదు, 'ఆర్డర్' లేదు అని ఆయన విరుచుకుపడ్డారు. మోదీ ఇచ్చిన డబ్బులను జగన్మోహన్‌రెడ్డి... సొంత పేర్లు పెట్టుకుని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. అమరావతి లేకుండా చేశారని అంటూ, తాము అమరావతికే కట్టుబడి ఉన్నామూ అంటూ మరో జోకు పేల్చారు.

నడ్డా ప్రసంగాన్ని సభికులు బాగా ఎంజాయ్ చేశారనే చెప్పాలి. ఆ సభలో మాట్లాడిన లోకల్ లీడర్లు కూడా, ఏపీ ప్రభుత్వంపై తమ తమ చెణుకుల లాంటి విమర్శలతో తమ శక్తికొద్దీ సభికులను ఆనందింప చేశారు అనిపించింది.

అలాగే, ఆ మరుసటి రోజు, విశాఖపట్నంలో.... కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా, ఇంచుమించు ఇలాంటి తన ప్రసంగంతోనే... సభికులకు కితకితలు పెట్టారు.

ఈ ఎండల వల్ల చెమట, ఉక్కపోతల మధ్య అల్లాడుతున్న జనానికి ఈ ప్రసంగాలు మంచి రిలీఫ్ ఇచ్చాయనే చెప్పాలి.

శ్రీకాళహస్తి, వైజాగ్‌లో బీజేపీ నేతల ప్రసంగాలు విన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు బోలెడన్ని సందేహాలు...!!

ఇంకో ఐదారు నెలల్లో... "తప్పనిసరి తద్దినం" లాంటి ఎన్నికలు రాష్ట్రంలో రాబోతుంటే, ఇప్పుడు వీరెందుకు ఢిల్లీ నుంచి రాష్ట్రానికి ఇంపోర్టు అయ్యారు? ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి.... ఏ ఎన్నికల్లో అయినా సరే... పోటీచేసి, 175లో ఏ నియోజకవర్గంలో అయినా సొంతంగా డిపాజిట్ తెచ్చుకోగలిగిన స్థాయి ఉందా? 'జగన్ సారథ్య' ప్రభుత్వంలో... 'శాంతి' లేదు....'భద్రత' లేదు అనే విషయం జే.పీ.నడ్డాకు, అమిత్ షాకు ఎప్పుడు తెలిసింది? తెలిసినప్పుడు, మరి ఏం చేశారు? 'అవి ఎందుకు ఏపీలో లేవో.... కనుక్కో'మని కేంద్ర హోం శాఖకు చెప్పారా? చెబితే, కేంద్ర హోంశాఖ ఏం చేసింది? ఏపీలో శాంతి, భద్రతలు లేని మాట నిజమే సుమీ అని చెప్పిందా?. అప్పుడు నడ్డా, అమిత్ షా ఏమి చేశారు? ప్రధాని మోదీ దృష్టికి తీసుకువచ్చారా? రాష్ట్రంలో 'లేకుండా పోయిన' శాంతి భద్రతలను పునరుద్ధరించడానికి కేంద్రస్థాయి ముఖ్య నాయకత్వ స్థానాలలో ఉన్న జేపీ నడ్డా, అమిత్ షా ఏమి చేశారు?

'ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు కనపడడం లేదు... ఏమయ్యాయి?' అనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సారథి అయిన జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారా? ఆయనేమన్నారు?

దేశంలోనే అత్యధిక స్థాయిలో ఏపీ ప్రభుత్వం అవినీతిలో మునిగి తేలుతున్న దని జేపీ నడ్డాకు, అమిత్ షాకు ఎలా తెలిసింది? వారు ఈ రాష్ట్ర పౌరులు కాదు కదా! ఒకరు హిమాచల్‌ప్రదేశ్‌కు, ఒకరు గుజరాత్‌కు చెందినవారు కదా! కేంద్ర నాయకత్వ స్థానాల్లో ఉండడంవల్ల వారికి ఈ విషయం తెలిసిందా? కేంద్ర ఇంటెలిజెన్స్ వారు చెప్పారా? లేక, నీతి-నిజాయతీలకు మారుపేరైన సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావు లాంటి బీజేపీ నాయకులు చెప్పారా? చెబితే... నడ్డా ఏమి చేశారు....? అమిత్ షా ఏమి చేశారు? మరి, కేంద్ర ప్రభుత్వం ఏం చేసింది?

దేశంలో అవినీతిని బీజేపీ అస్సలు సహించలేదు అనేది మనందరికీ తెలిసిన విషయమే కదా! అలా సహించలేకనే కదా, ఒక చిత్రమైన అవినీతిని పాతాళ లోకం లోనుంచి తవ్వి తీసే క్రమంలో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను, ఆరోగ్యమంత్రి జైన్‌ను ఈడ్చుకెళ్లి జైలులో వేయించారు?

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఎక్కడైనా దొరుకుతాడా అని భూతద్దాలు వేసి మరీ వెదుకుతున్నారు కదా?? ఇందులో 'నిందితులు' అనుకుంటున్న వారు 'అప్రూవర్'లుగా మారారు కదా? దేశంలో అవినీతిని సహించలేకనే కదా... కేంద్ర (ఉత్తుత్తి) దర్యాప్తు సంస్థలు ఇదంతా చేసింది? చేస్తున్నది? చేయబోతున్నది? తమిళనాడు సీ.ఎం స్టాలిన్ ఎక్కడైనా దొరుకుతాడా అని తమిళనాడు అంతా గాలిస్తున్నారు కదా? నిన్నగాక మొన్న, స్టాలిన్ మంత్రివర్గంలోని ఓ మంత్రి తమ్ముడి నివాసం... కార్యాలయాలు మొదలైన 30 చోట్ల సీబీఐ వాళ్ళు దాడులు చేశారు కదా!? కర్ణాటకలో ఇప్పటి ఉప ముఖ్యమంత్రిని ఎన్నికలకు బాగా ముందుగానే... తీహార్ జైలులో పారేశారు కదా?

కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, హరియాణా, ఉత్తరప్రదేశ్, బీహార్ బెంగాల్, అస్సాం మొదలైన రాష్ట్రాల్లోని బీజేపీ నేతలలో ఒక్కరి పై కూడా అవినీతి ఆరోపణలు లేనందుకు సంతోషపడుతూనే ఆంధ్రప్రదేశ్‌లోని "అవినీతి" పై కేంద్ర బీజేపీ నేతలు ఇన్నాళ్లుగా ఏమి చేస్తున్నారో జనం మట్టి బుర్రలకు అర్థం కాలేదు.

మళ్లీ ప్రశ్నలు.... ప్రశ్నలే ప్రశ్నలు....

ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ బాధ్యతలు నిర్వహిస్తున్న జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఈ ఆరోపణ లను బీజేపీ కేంద్ర నాయకులు తీసుకువచ్చారా? కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి గానీ జగన్‌కు వ్యక్తిగత స్థాయిలో గానీ ఈ 'అవినీతి' గురించి గానీ ఈ నాలుగేళ్లల్లో చెప్పారా? ఆయన ఎప్పుడు కావాలి అనుకుంటే, అప్పుడు అపాయింట్ మెంట్ ఇస్తున్నారు కదా! రాత్రి పదింటికయినా... అపాయింట్‌మెంట్‌లకు ఢోకా ఉండదం లేదు కదా!? ఆయన తమకు ప్రతిపక్షం అనుకుంటే సీబీఐనో... ఈడీనో ఉసి గొల్పాలి... మరి వాటిని వదిలారా? లేదా మిత్ర పక్షం అనుకుంటే... 'ఏమిటి ఈ అవినీతి...?' అంటూ హిత వచనం చెప్పాలి కదా?! చెప్పారా?

ఈ రెండింటిలో జే పీ నడ్డా, అమిత్ షా ఏమి చేశారు? చేసి ఉంటే... జనం దృష్టికి తీసుకురావాలి కదా! తీసుకువచ్చారా?

ఇంతకీ, జగన్‌మోహన్‌రెడ్డిని.. కేంద్ర బీజేపీ పెద్దలు మిత్రపక్షంగా చూస్తున్నారా? శత్రుపక్షంగా చూస్తున్నారా?

మిత్రపక్షమే అనుకుంటే... ఆయన మీదా, ఆయన సారథ్యంలోని ప్రభుత్వ యంత్రాంగం మీదా ఈ 'నిందలు' ఏమిటి? ఈ 'దూషణలు' ఏమిటి? ఎన్ని దుర్భాషణలు చేసినా.... జగన్మోహన్‌రెడ్డి చిరునవ్వుతో






స్వీకరిస్తారు తప్ప తిరిగి రెండు అంటించలేరనే ధీమానా? ఆయన మౌనాన్ని, చెరగని చిరునవ్వును బీజేపీ కేంద్ర పెద్దలు అలుసుగా తీసుకున్నారా? ఎంత ముఖ్యమైన అంశంపై అయినా స్పందించడం అనేది ఆయన తత్వం కాదు.

పోనీ, జగన్ తమ శత్రుపక్షం అని అనుకుంటే, దర్యాప్తు సంస్థల్ని ఎందుకు వదలడం లేదు? జగన్‌ను ఇబ్బంది పెట్టాలి అనుకుంటే కేజ్రీవాల్‌ను 'పట్టు కోడానికి' శ్రమ పడినట్టు ఇక్కడ అంత శ్రమ పడ నవసరం లేదు కదా! ఆల్రెడీ బోలెడన్ని కేసులు... గట్రా ఉండనే ఉన్నాయి.

మరి, అదీ చేయక, ఇదీ చేయక... బీజేపీ నడ్డా, అమిత్ షా.. కూడబలుక్కుని వచ్చినట్టు రాష్ట్రానికి వచ్చి, నోరు పారేసుకోడానికి కారణం ఏమిటి?

పోనీ రాజకీయంగా చూస్తే.... ఏపీలో బీజేపీ... కనుచూపు మేరలో కనపడడం లేదు కదా!?

దానికి ఇక్కడ ఓటు బ్యాంకు లేదు. ఓటు శాతం లేదు. ప్రజల దృష్టిలో....'రాష్ట్ర స్థాయి', దూరదృష్టి, గౌరవ ప్రదమైన కలిగిన నాయకత్వం లేదు కదా!?. అటు వైసీపీతోనో, ఇటు టీడీపీతోనో చేతులు కలపకుండా.... అసెంబ్లీకి గానీ, లోకసభకు గానీ ఒక్కరు కూడా ఎన్నిక అయ్యే ప్రశ్నే లేదు కదా!?.

'జన సేన 'అనే ఒక 'జన సమూహాని'కి నాయ కత్వం వహిస్తున్నాను అనుకుంటున్న పవన్ కళ్యాణ్‌తో సఖ్యత లేదు అనేది కూడా ఓ బహిరంగ రహస్యమై పోయింది కదా!. నడ్డా, అమిత్ షా పాల్గొన్న బహి రంగ సభలకు కూడా పవన్ కళ్యాణ్‌ను పిలువలేదు. ఆయనా పాల్గొన లేదు.

మరి, ఆంధ్రప్రదేశ్‌కు వారిద్దరూ ఎందుకు వచ్చినట్టు? ఎం దుకూ అంటే.... ఈ రెండు పార్టీలు – ఒకదానికి ఒకటి – బి టీమ్ అని జనం అనుకుంటున్న మాట కరెక్ట్ కాదు అని చెప్పే ప్రయత్నం చేయడానికి జేపీ నడ్డా, అమిత్ షా ఒకేసారి వచ్చారు. వైసీపీని తిట్టిపోశారు. మళ్లీ ఢిల్లీ వెళ్లిపోయారు.

అయినప్పటికీ గత నాలుగేళ్లుగా పల్లెత్తు మాట కూడా అనని వైసీపీని, ఇప్పుడు హటాత్తుగా తిట్టి పోస్తే, జనానికి నవ్వు రాక ఏమి వస్తుంది?

జడివాన లాటి బీజేపీ కేంద్ర నేతల విమర్శలు చూసిన కొన్ని న్యూస్ చానెల్స్ వాళ్ళు కొంత ఆవేశానికి లోనైనట్టున్నారు...,' బీజేపీ ట్రెండ్ మారింది.... గొంతు మారింది... వైసీపీ ఔట్..' అంటూ చర్చా వేదికలతో ఊదర కొట్టేశారు.

ఈ విమర్శలకు ఎం.పీ విజయసాయిరెడ్డి చక్కని సమాధానం ఇచ్చారు. పార్టీలు వేరు.... ప్రభుత్వాలు వేరు అని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చి పుచ్చుకునే ధోరణిలోనే కలిసి సాగుతాయని పార్టీలు మాత్రం వేరు వేరు అని విజయసాయిరెడ్డి వివరించారు. అంటేబీ జే పీ నడ్డా, అమిత్ షా విమర్శలను పట్టించుకోవాల్సిన పని లేదని ఆయన తేల్చిచెప్పారు. బీజేపీ ఢిల్లీ ఆసాముల విమర్శలకు మరో కోణం కూడా ఉండే అవకాశం లేకపోలేదు.

ఈ బీజేపీ మీటింగ్‌లకు ముందు...., తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు ఢిల్లీ వెళ్లి అమిత్ షాను కలిశారని, నడ్డా కూడా అమిత్ షా ఇంటికి వెళ్లి ఈ సమావేశంలో పాల్గొన్నారని వార్తలు వచ్చాయి.

చంద్రబాబుతో షా కలవడం ఈ నాలుగేళ్లల్లో ఇదే మొదటిసారి.

ఆ మీటింగ్‌కు, ఈ ఉపన్యాసాలకు లింకు ఏమైనా ఉన్నదా? లేకపోతే, ఏపీలో వైసీపీని తిట్టిపోస్తే.... హైదరాబాద్ – తెలంగాణలో ఓటు హక్కు కలిగిన ఆంధ్ర 'సెటిలర్స్' బీజేపీ వైపు మళ్లుతారు అనే ఆలోచనతో తిట్టిపోశారా అనే కోణం కూడా లేక పోలేదు.

ఎందుకంటే, బెంగాల్ ఎన్నికల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇలాటి ట్రిక్కునే ప్రయోగించారు. 'మాతో (MATAU)' అనే సెక్ట్‌కు చెందిన దళిత వర్గీయులు బాంగ్లాదేశ్ విభజన సమయంలో... అక్కడి నుంచి బెంగాల్ వచ్చేసి స్థిరపడ్డారు.

హరిచంద్ ఠాకూర్ అనే ఆయన ఈ వర్గాన్ని రూపొందించారు. ఆయన 1812లో బాంగ్లాదేశ్‌లో జన్మించారు. బెంగాల్‌లోని నాలుగు లోకసభ నియోజకవర్గాలలో వారు ఏమి చెబితే అదే ఫైనల్. వారి జనాభా ఇప్పుడు పెరిగి, పెరిగి ఒక కోటికి చేరుకున్నది అంటారు. 2019 లోకసభ ఎన్నికల్లో వారు బీజేపీకి మద్దతు ఇచ్చారు. దాంతో, బీజేపీకి 18 సీట్లు వచ్చాయి. 2021 అసెంబ్లీ నాటికి వారికి బీజేపీ రాజకీయం అసలు సంగతి తెలిసింది. దూరం జరిగారు. దాంతో, వారిని ప్రసన్నం చేసుకోడానికి, 'అటునుంచి నరుక్కు రావాలని' బీజేపీ పెద్దలు నిర్ణయించారు. ఎన్నికల ప్రచారం మధ్యలో – బాంగ్లాదేశ్ స్వతంత్ర దినోత్సవం అంటూ – నరేంద్ర మోదీ – హటాత్తుగా – బాంగ్లాదేశ్ వెళ్లి –మాతో సెక్ట్‌ను సృష్టించిన – హరిచంద్ ఠాకూరు అనే ఆయన జన్మ స్థలమైన –'ఒరాకండి'ని – దర్శించి, హరిచంద్ ఠాకూరు స్మృతికి – భక్తి ప్రపత్తులతో నమస్కరించే దృశ్యానికి భారత మీడియాలో విస్తృత, భారీ, బహుళ ప్రచారం లభించింది. (అయినా పని జరగలేదు అనేది వేరే విషయం.)

అలాగే, తెలంగాణలోని 'ఆంధ్ర సెటిలర్స్'ను(తెలంగాణ నేతలు అలాగే పిలుస్తారు) ప్రసన్నం చేసుకోడానికి జే పీ నడ్డా, అమిత్ షా.... ఆంధ్రప్రదేశ్ వెళ్లి వైసీపీపై విరగదీసుకు పడిపోయారా అనే అనుమానం కూడా విశ్లేషకులకు లేకపోలేదు. తెలంగాణలో ఉన్న 119 స్థానాల్లో.... దాదాపు 35,40 స్థానాల్లో 'ఆంధ్ర సెటిలర్స్' గట్టిగా ఉన్నారు. వారిలో అధికులు టీడీపీ సానుభూతిపరులు, అభిమానులు. వారికి, బీజేపీపై సానుకూల అభిప్రాయం ఏర్పడి (బీజేపీ నేతలు వైసీపీని తిట్టి పోసినందుకు), తెలంగాణ ఎన్నికల్లో బీజేపీకి ఓట్ వేస్తారనే దూరదృష్టితో కూడా జేపీ నడ్డా, అమిత్ షా ఒక ట్రయల్ వేసి ఉండే దానికి అవకాశం లేకపోలేదు.

ఈ నాయకుల స్పీచ్‌లు విన్న జనానికి ఇంకో సందేహం వచ్చింది...

'ఇంత అవినీతి'కి పాల్పడుతున్నదని విమర్శించి వైసీపీతో... వచ్చే ఎన్నికల్లో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ బీజేపీ జత కట్టదా? వైసీపీని కాదు అనుకుంటే – రాష్ట్రంలో మిగిలి ఉంది టీడీపీయే కదా! దాంతో బీజేపీ జత కడుతుందా? లేకపోతే, మా ఒక్క శాతం ఓట్లు మాకు చాల్లే అనుకుంటూ, సొంతంగా ఎన్నికలకు వెళుతుందా?

బీజేపీ గేమ్‌ప్లాన్ ఏమిటనేది మరి కొన్నాళ్ళు పోతేగానీ అర్థం కాదు. ఇప్పటికైతే, బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం, వైసీపీ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం... విజయసాయిరెడ్డి చెప్పినట్టు.... చెట్టా పట్టాలు వేసుకుని వెళ తూనే ఉంటాయి.

– భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# శ్రీ కస్తూరిదేవి విద్యాలయ సంస్థల కమిటీపై
# జమీన్‌రైతు పత్రికలో వస్తున్న తప్పుడు వార్తలకి, అసత్యపు రాతలకి
# ఖండన ప్రకటన

**నా కక్షిదారు శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ, నెల్లూరు వారి సంజాయిషీ మేరకు ఈ ఖండన ప్రకటన ఇవ్వడమైనది:**

**శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ సభ్యుల నైతికతను, వారి ప్రతిష్టను, గౌరవ మర్యాదలను కించపరిచే విధముగా అసత్యపు వార్తలు ప్రచురించిన జమీన్‌రైతు పత్రిక మేనేజింగ్ ఎడిటర్ నెల్లూరు డోలేంద్ర ప్రసాద్‌ని తమ తప్పుడు వార్తలకు వివరణ కోరుతూ సదరు కమిటీ సభ్యులు తెలిపిన నిజానిజాలను దిగువ పొందుపరుస్తూ, అవాస్తవాలను చిత్రీకరించిన డోలేంద్ర ప్రసాద్‌ని బహిరంగంగా క్షమాపణ చెప్పవలసిందిగా నా కక్షిదారు తరఫున డిమాండ్ చేయడమైనది:**

### జమీన్‌రైతు వార్త:

మే 19వ తేదీ, 2023 సంచికలో "కస్తూరిదేవి కబ్జాకు మళ్ళీ ప్రయత్నం..!" అంటూ అడ్డగోలు రాతలు రాశారు. ఆ వార్తలో గేట్లకి తాళాలు వేసి కాలేజీ భవనాలను నేలమట్టం చేస్తున్నారని అసత్యాలు వల్లించారు.

### అసలు నిజం :

ఆరోజు ప్రాంగణం గేట్లకి పగలు కమిటీ ఎలాంటి తాళాలు వేయలేదు. సదరు కమిటి ఆమోదించిన తీర్మానము మేరకు శ్రీ కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణంలో జి.వి.కె కస్తూరిదేవి విద్యాలయం పేరుతో సిబిఎస్ఇ స్కూలును ఏర్పాటు చేయుటకు గాను అధునాతనమైన కొత్త భవనాన్ని నిర్మించుటకు 'నుడా' నుండి తాత్కాలిక అనుమతి పొంది ఉన్నారు. గతంలో శ్రీమతి నాగారెడ్డి స్నేహలతారెడ్డి – వేణుగోపాలరెడ్డి సెంటర్ ఫర్ ఆర్ట్స్ & సైన్స్ పేరుతో కట్టియున్న భవనము శిథిలమై కూలిపోయే స్థితిలో ఉండడమే కాకుండా, నూతనంగా నిర్మించబోయే భవన ప్రవేశానికి అడ్డంగా ఉన్నందున సదరు భవనాన్ని




తొలగించాలని కమిటీ తీర్మానించి తొలగించింది. ఆధునిక వసతులతో కొత్త స్కూల్ భవనాన్ని నిర్మించడానికి కమిటీ ప్రణాళిక సిద్ధం చేసింది. అంతకుమించి పాత కాలేజీ భవనాలు ఒక్కటి కూడా నేలమట్టం చేయలేదు. కొత్త స్కూల్ నిర్మాణం కోసం కమిటీ అధ్యక్షులు జి.వి.కె రెడ్డి గారు సుమారు 20 కోట్ల రూపాయలు ఇప్పటికే కస్తూరిదేవి విద్యాలయ కమిటీ ఖాతాలో జమచేసి ఉన్నారు. స్కూల్ భవన నిర్మాణం అనుమతుల కోసం ప్రభుత్వ నిబంధనల ప్రకారం **1,19,00,000**(కోటి పంతొమ్మిది లక్షల రూపాయలను) ఫీజు కింద "నుడా"కి కూడా చెల్లించారు. సంస్థ అభివృద్ధి పట్ల ఆయనకున్న అంకితభావానికి, సమాజ హితం పట్ల ఆయనకున్న బాధ్యతకు ఇది నిదర్శనం. ఒక దాత సహాయంతో నిర్మించిన పైన కనబరచిన కట్టడము మాత్రమే తొలగించారు. కమిటీ సమావేశాలలో తీసుకునే నిర్ణయాలను, సంస్థ అభివృద్ధి కోసం కమిటీ చేపడుతున్న సంస్కరణలను తెలుసుకోకుండా రాసిన మీ రాతలన్నీ పచ్చి అసత్యాలు.

జి.వి.కె రెడ్డి గారు తమ స్వంత నిధుల నుండి సమాజసేవ కోసం ప్రత్యేకంగా స్థాపించిన జి.వి.కె ఫౌండేషన్ అనే సంస్థ ద్వారా **20** కోట్ల రూపాయలను సేవాదృక్పథంతో కస్తూరిదేవి సంస్థకి విరాళంగా ఇచ్చారు. జి.వి.కె గారి కంపెనీలకి జి.వి.కె గారు స్థాపించిన ఫౌండేషన్‌కు ఏ సంబంధము లేదు. వాస్తవాలు తెలుసుకోకుండా సభ్యతా సంస్కారం కూడా లేకుండా సభ్యులను కించపరుస్తూ.. మీ పత్రికలో అడ్డగోలు రాతలు రాయడం చట్టరీత్యా నేరం. నిజానిజాలు తెలుసుకోకుండా సంస్థ అంతర్గత వ్యవహారాలను మీ ఇష్టానుసారం పత్రికలో ప్రచురించడం చట్టవిరుద్ధం. అసలు ఏదైనా సొసైటీ యొక్క ఆస్తులను ఆ సొసైటీ సభ్యులు అమ్మలేరన్న కనీస న్యాయ సిద్ధాంతం కూడా తెలియకుండా ఏమాత్రం విజ్ఞత లేకుండా ఇలాంటి తప్పుడు రాతలు రాయడం దాతల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా, వారి కీర్తిప్రతిష్టలను కూడా కించపరచడమే అవుతుంది. అటువంటి చర్యలు చట్ట విరుద్ధం. ఇలాంటి రాతల వలన దాతృత్వ మనస్తత్వం ఉన్న దాతలు వెనకడుగు వేసే ప్రమాదం ఉంది.

### అదే వార్తలో:

"దొడ్ల శేషారెడ్డి ఆయనకు ఆయనే కార్యదర్శి పదవిని ఇచ్చుకున్నారు' అని ప్రచురించారు. అభ్యంతరకరమైన భాష వాడి "తోడుదొంగ" అని సంబోధించారు. ఇదే క్రమంలో "ఎవడబ్బ సొత్తు", "కబ్జాకోరులు" అన్న అసభ్య పదాలను కూడా జోడించారు.

### అసలు నిజం:

కస్తూరిదేవి విద్యాలయ సంస్థల అభివృద్ధి కోసం పాటుపడే వారికి, సంస్థ వ్యవస్థాపకుల ఆశయం కోసం పరితపించేవారికి సంస్థ కమిటీలో స్థానం కల్పించారు. చట్టబద్ధంగా పనిచేసే కమిటీలో ఎవరికి వారే హోదాలు కల్పించుకోవడం అసంభవం అనే కనీస విజ్ఞత కూడా లేకుండా చట్టాలమీద కనీస అవగాహన కూడా లేకుండా వార్త రాయడం హేయమైన చర్య. నిబంధనలకు లోబడి నడిచే సొసైటీ 'ఎవడబ్బ సొత్తూ' కాదు. ఇది పూర్తిగా సొసైటీకి సంబంధించినది. దీనిని ఎవ్వరూ కబ్జా చెయ్యలేరు. భవిష్యత్తులో కూడా కస్తూరిదేవి విద్యాలయ సంస్థలు శాశ్వతంగా సొసైటీ ఆధ్వర్యంలోనే నడవాలని ప్రతిపాదన చేసి, కమిటీ తీర్మానం కూడా చేసింది. కస్తూరిదేవి విద్యాలయ ఆస్తులను ఎవరు కబ్జా చెయ్యాలని చూశారో, ఎవరు తోడుదొంగలో కూడా త్వరలోనే ప్రజలకు తెలియజేయడం జరుగుతుంది.

సమాజంలో గౌరవప్రదంగా జీవించే వ్యక్తులను, వారి కుటుంబాలను కించపరిచే విధంగా మీ ఇష్టం వచ్చిన పదజాలాన్ని ప్రయోగించి వారిని అవమానించడం చట్టరీత్యా నేరం. సమాజంలో పేరు ప్రఖ్యాతులున్న సంస్థలు, వ్యక్తుల ప్రతిష్టను దిగజార్చడమే మీ లక్ష్యంగా ఉన్నట్లు మీ వికృత రాతల ద్వారా స్పష్టమవుతోంది.

**అబద్దాలతో, అభూతకల్పనతో శ్రీ కస్తూరిదేవి విద్యాలయ సంస్థ ప్రతిష్టకి, సంస్థ కమిటీ సభ్యుల నిబద్ధతకి భంగం కలిగేలా మీ రాతలు ఉన్నాయి. వాస్తవాలు తెలుసు కోకుండా మీ ఇష్టానుసారం వార్తలు ప్రచురించడం ద్వారా సంస్థకి, తద్వారా సంస్థ కమిటీకి మరియు సభ్యుల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారని నా కక్షిదారులు అభిప్రాయపడుతున్నారు.**

**మీ పత్రికలో రాసిన అసత్యపు కథనాలకి మీ పత్రికా పరంగానే బహిరంగ క్షమాపణలు చెప్పాలని, నిజాలను ప్రజలకు వివరించాలని లేదా మీపై న్యాయపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని నా కక్షిదారు తరఫున హెచ్చరించడమైనది.**

**- నాగారెడ్డి శ్రీనివాసులరెడ్డి,** B.Sc., BL
న్యాయవాది
రాంజీనగర్, నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com